

జగన్ ఫొటోతో ఇన్‌కమ్ సర్టిఫికెట్ జారీ 6
ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి తొలి నామినేషన్ దాఖలు 6
నేడు సత్యదేవుని తెప్పోత్సవం 7

రైతుల్లో కలవరం



- బంగాళాఖాతంలో అల్పపీడనంతో మారిన వాతావరణం
- వర్షంతో అక్కడక్కడా స్వల్పంగా తడిచిన ధాన్యం రాశులు
- కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట
- పొలాల్లోనే పనలు, ధాన్యం
- అధిక వర్షాలు పడితే నష్టపోతామని రైతుల్లో ఆందోళన

ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కొని సాగు చేసిన వరి పంట చేతికందుతున్న వేళ మారిన వాతావరణ పరిస్థితులు రైతుల్లో కలవరం సృష్టిస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆకాశం మేఘావృతం కావడంతో పాటు వర్షం కురవడం వారిలో మరింత ఆందోళన పెంచింది. వర్షానికి అక్కడక్కడా ధాన్యం రాశులు స్వల్పంగా తడిచాయి. భారీ వర్షాలు పడితే నష్టపోతామని రైతులు కలవరపడుతున్నారు.

కోసిన పంటను ఆరబెట్టిన రైతులు

గొల్లప్రోలులో కోయడానికి సిద్ధంగా వరిపంట

పిఠాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సోమవారం సాయంత్రం నుంచి వాతారవరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఆకాశం మేఘావృతం కావడంతోపాటు మంగళవారం ఉదయమే పిఠాపురం, గొల్లప్రోలు పరిసర ప్రాంతాల్లో వర్షం పడింది. సార్వా వరికోతలు, మాసూళ్ల ప్రారంభమైన సమయంలో కురిసిన వర్షం, వెన్నాడుతున్నా మేఘాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. అష్టకష్టాలు పడి పంటలను సాగు చేసి ఇంటికి తెచ్చుకునే వేళ అల్పపీడనం ఏర్పడడం వారికి కలవరాన్ని కలిగిస్తోంది. వర్షానికి అక్కడక్కడా తడిచిన ధాన్యం రాశులను ఆరబెట్టుకోవడంలో రైతులు నిమగ్నమయ్యారు. వరి కోతలు ప్రారంభిద్దామని భావిస్తున్న రైతులు వరికోత యంత్రాల ద్వారా మాసూళ్ల పూర్తికి ప్రయత్నిస్తున్నారు.

ఆది నుంచి కష్టాలే

ఈ ఏడాది సార్వా సాగులో రైతులు ఆది నుంచి కష్టాలు ఎదుర్కొన్నారు. సాగు ప్రారంభ సమయంలో ఏలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు కనిష్ఠస్థాయి కంటే దిగువకు చేరింది. కూటమి ప్రభుత్వం స్పందించి పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని తిరిగి వినియోగంలోకి తెచ్చి గోదావరి జలాలను ఏలేరుకు మళ్లించింది. దీంతో ప్రాజెక్టు నుంచి నీరు విడుదల ప్రారంభమైంది. దీని వల్ల ఏలేరు, పీబీసీ ఆయకట్టు పరిధిలోని 1.07 లక్షల ఎకరాల్లో వరి తదితర పంటలను రైతులు సాగుచేశారు. నాట్లు పూర్తయి పంటలు ఆశాజనంగా ఉండగా తుఫాన్ విరుచుకుపడి భారీ వర్షాలతో ఏలేరు, సుద్దగడ్డకు వరదలు వచ్చి ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది.

పెట్టుబడులయినా వస్తాయని..

వరదలు భారీనష్టం కలిగించినా తేరుకున్న రైతులు వరిపంటపై మళ్లీ పెట్టుబడులు పెట్టారు. 50శాతం దిగుబడులైనా వస్తాయని, తద్వారా పెట్టుబడులు దక్కించుకోవచ్చునని రైతులు ఆశించారు. అదనంగా పెట్టుబడులు పెట్టిన ఈనిక దశ వచ్చే సమయానికి పంటపై తెగుళ్లు ఆశించాయి. పురుగుమందులు పిచికారీ చేయాల్సి వచ్చింది.

పంట చేతికందే వేళ

ఏలేరు, పీబీసీ ఆయకట్టుతో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఏలేరు, పీబీసీ ఆయకట్టులో 10శాతం విస్తీర్ణంలో కోతలు, మాసూళ్లు పూర్తయ్యాయి. ఎక్కువ ప్రాంతాల్లో వరికోత యంత్రాల ద్వారా మాసూళ్లు నిర్వహించడంతో రైతులు ఎక్కడిక్కడ కళ్లాల్లో దాన్యాన్ని ఆరబెట్టారు. ధాన్యం కొనుగోళ్లు ఊపందుకోకపోవడంతో పొలాల్లోనే ధాన్యం రాశులు ఉండిపోయాయి.ఇదే సమయంలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటను ఒబ్బిడి చేసుకోవాలని భావిస్తున్న తరుణంలో మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి అక్కడక్కడ ధాన్యం రాశులు స్వల్పంగా తడిచాయి. మళ్లీ ఎండ కాయడంతో రైతులు ధాన్యం రాశులను కళ్లాలు,జాతీయ రహదారులు, గ్రామీణ రోడ్లు వెంబడి ఆరబెట్టారు. మధ్యాహ్నంనుంచి మళ్లీ ఆకాశంలో మబ్బులతో రైతుల్లో కలవరం మొదలైంది.

రైతులంతా అప్రమత్తంగా ఉండాలి

కోటనందూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా 2.25లక్షల ఎకరాల్లో వరిపంట ఉంది. ఇందులో ఎక్కువగా 1064, 1061, ఆర్‌జీఎల్, స్వర్ణ వంటి రకాలున్నాయి. ఈ ఏడాది ఊడ్చిన దగ్గర నుంచి తుపాన్ ప్రభావంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అల్పపీడన ప్రభావంతో రైతులందరూ అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంతో కామన్ ధర రకం 75 కిలోల బస్తాకు రూ.1725, సన్నరకం రూ.1740గా ప్రకటించడంతో రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు.

-సుంకర బుల్లిబాబు, వ్యవసాయ శాఖ ఏడీ, తుని సబ్ డివిజన్

భారీ వర్షాలు పడితే..

అల్పపీడన ప్రభావం కాకినాడ జిల్లాపై అంతగా ఉండదని వాతావరణశాఖ చెప్పినా వాతావరణం అందుకు భిన్నంగా ఉంది. ఇప్పుడు భారీ వర్షాలు పడితే వరిపంటకు తీవ్ర నష్టం జరుగుతుంది. ఏలేరు, పీబీసీ ఆయకట్టులో మరో 20శాతం విస్తీర్ణంలో వరి పంట కోతకు సిద్ధంగా ఉంది. మిగిలిన విస్తీర్ణంలో ఈనిక దశ, వరి కంకుల్లో గింజ గట్టిడే దశలో పంట ఉంది. ఈ సమయంలో వర్షాలు పడి గాలులు వీస్తే పంట నేలనంటుతుందని, గింజ పొల్లుబారిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సార్వా వరి పంట చేతికందే సమయంలో తుఫాన్లు ఏర్పడి, పంటకు నష్టం కలిగించడం రెండుదశాబ్దాలుగా జరుగుతోంది. ప్రతిఏటా ఈ సమయంలో వర్షాలు వెన్నాడటం సర్వసాధారణంగా మారింది. రైతులు భారీగా పంటలను నష్టపోయారు. దీన్ని దృష్టిలో ఉంచుకునే వ్యవసాయశాఖ ముందస్తు సాగుచేయాలని విస్తృత ప్రచారం సాగిస్తోంది.

● కోత మిషన్లకు గిరాకీ

కొత్తపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు త్వరగా పంటను ఒబ్బిడి చేసుకునేందుకు రైతులు ఆరాటపడుతున్నారు. రైతులంతా కోత మిషన్‌లతో కోత కోయించుకొనేందుకు సిద్ధపడుతున్నారు. దీంతో వాటికి ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడింది. కొత్తపల్లి మండలంలో కోత కోసేందుకు నాలుగైదు మిషన్లు పనిచేస్తున్నాయి. ఈ మిషన్‌లను పెద్ద రైతులు అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవడంతో సన్న, చిన్నకారు రైతులు పంటలను ఒబ్బిడి చేసుకొనేందుకు వీలుపడక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అల్పపీడన ప్రభావంతో కొత్తపల్లిలో సోమవారం అర్ధరాత్రి భారీగా కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో కోత కోసిన వరిపనలు నీట మునిగాయి. మండలంలోని కొత్తపల్లి, వాకతిప్ప, కొండెవరం, కుతుకుడుమిల్లి గ్రామాల్లో కోతమిషన్లు దిగని చేలల్లో రైతులు కూలీలతో కోతలు కోయించుకున్నారు. కూలీలతో కోత కోసిన చేలు మూడు,నాలుగు రోజుల వ్యవధిలో పన కట్టించుకుని కుప్పవేస్తారు. ఇలా కోత కోసిన పనలు గత అర్ధరాత్రి భారీ వర్షాలకు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



కొత్తపల్లిలో వరికోత కోస్తున్న మిషన్

అసెంబ్లీలో టీడీపీ విప్‌గా తుని ఎమ్మెల్యే యనమల దివ్య



తుని రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏపీ శాసనసభ, శాసనమండలిలో చీఫ్ విప్, విప్‌లను ప్రభుత్వం నియమించింది. జిల్లా నుంచి తుని ఎమ్మెల్యే యనమల దివ్య టీడీపీ తరపున విప్‌గా నియమితులయ్యారు. ఆమె నియామకంపై తుని నియోజకవర్గ కూటమి పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా యనమల దివ్య మాట్లాడుతూ తమ అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌తోపాటు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తనకు విప్‌గా అవకాశం కల్పించడంపై కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కుడా చైర్మన్ రామస్వామి

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన జనసేన జిల్లా అధ్యక్షుడు, పెద్దాపురం జనసేన ఇన్‌చార్జి తుమ్మల రామస్వామి(బాబు) మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



కలెక్టర్‌కు వినాయకుడి చిత్రపటం అందజేస్తున్న రామస్వామి

తుని విమానాశ్రయ పనుల్లో కదలిక

- 6 ఎయిర్‌పోర్టుల విజిబులిటీకోసం రూ.2.27కోట్లు విడుదల
- తునిలో ఎయిర్‌పోర్టుకు చోటు

తుని రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో కాకినాడ జిల్లాకు కొత్తగా విమానాశ్రయం నెలకొల్పేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో తుని-అన్నవరం మధ్య ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయాలన్న యోచనతో జిల్లా యంత్రాంగానికి భూ సేకరణ ఆదేశాలు జారీ చేసింది. దీంతో తొండంగి మండలం పీఈ చిన్నయ్యపాలెం, బెండపూడి గ్రామాల మధ్య భూసేకరణకు ప్రాథమికంగా కసరత్తు పూర్తయింది. తాజాగా రాష్ట్రంలో 6 గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుల విజిబులిటీకోసం రూ.2.27కోట్ల నిధులు విడుదల చేసినట్లు రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి కల్పించడం, ఆరు ఎయిర్‌పోర్టుల్లో తుని నియోజకవర్గంలో తుని-అన్నవరం మధ్య ఎయిర్‌పోర్టు ఉండడంతో ఈ పనులు ఒక అడుగు ముందుకు పడినట్లు అయింది. అప్పటికే ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 9అంశాలపై అధ్యయనం పూర్తయిది. ఇది తుది రూపం దాల్చడంతో పనులు ప్రారంభానికి రంగం సిద్ధమవుతోంది.

నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై అవగాహన

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల ప్రక్రియపై క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతి అంశం మీద దృష్టి పెట్టి అవగాహన పెంపొందించుకుని ప్రశాంత వాతావరణంలో ఎన్నిక జరిగేందుకు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు ఆదేశించారు. జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో గోదావరి, ఏలేరు, పుష్కర, పంప, సుబ్బారెడ్డిసాగర్, తాండవ, మైనర్ ఇరిగేషన్ చెరువుల ఆయకట్టు కిందఉన్న నీటి సంఘాలకు ఎన్నికలకు ఈనెల 20న ఆయా మండలాలవారీగా నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ప్రాదేశిక నియోజకవర్గం వారీగా రైతుల ఓటరు జాబితా ప్రచురిస్తామన్నారు. వీటిపై ఈనెల 15 వరకు కాకినాడ, పెద్దాపురం ఆర్డీవో కార్యాలయాల్లో అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై అనుసరించాల్సిన విధానాలపై మాస్టర్ ట్రైనీ, ఇరిగేషన్ డీఈ రవికుమార్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కేఎస్ఈజెడ్ ఎస్డీసీ రామలక్ష్మి, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు పాల్గొన్నారు.

త్వరితగతిన చికిత్స అందిస్తే న్యూమోనియా మరణాలు నివారించవచ్చు: డీఎంహెచ్‌వో

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే ఏఎన్ఎంలు, ఆశాలు, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, సంబంధిత వైద్యులు న్యూమోనియా వ్యాధిని శిశువుల్లో త్వరగా గుర్తించి చికిత్స అందజేయడం ద్వారా ఐదేళ్ల లోపు పిల్లల మరణాలు నివారించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. అంతర్జాతీయ న్యూమోనియా డే వేడుకలను కాకినాడ జీజీహెచ్‌లో మంగళవారం నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పిడియాట్రిక్స్ విభాగ లెక్చర్ గ్యాలరీలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా సోషల్ అవేర్నెస్ అండ్ యాక్షన్ ప్లాన్ టూ న్యూట్రలైజ్ న్యూమోనియా సక్సెస్‌ఫుల్లీ(శాన్స్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం వచ్చేఏడాది ఫిబ్రవరి 25 వరకు జరగనుంది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ముఖ్యంగా వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని తల్లులకు సూచించారు. డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు మాట్లాడుతూ తల్లులకు న్యూమోనియా గురించి అవగాహన కల్పించి వ్యాధి లక్షణాలు గుర్తించి సకాలంలో వైద్యం చేయించడం ద్వారా చంటి బిడ్డల మరణాలు తగ్గించవచ్చన్నారు. న్యూమోకోకల్, కాంజుగేట్ వ్యాక్సిన్ రెండు మోతాదులు ఆరువారాలు, 14 వారాలను, 9 నెలలకు బూస్టర్ డోస్ వేయించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విరివిగా న్యుమోనియాపై అవగాహనా సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులుగా చేస్తారు. ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, పిడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ డి.మాణిక్యాంబ, గైనిక్ హెచ్‌వోడీ డాక్టర్ అనురాగమయి, ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ ఐ.ప్రభాకర్, ఎస్‌హెచ్ఎం డాక్టర్ సురేఖ, డీఎంఓ డాక్టర్ రవికుమార్, ఎపిడిమాలజిస్ట్ డా క్టర్ బండార రవికుమార్, డాక్టర్ ఆర్.రమేష్, పిడియాట్రిక్ వైద్యనిపుణులు డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు, ఎస్‌ఓ విజయలక్ష్మి, డిప్యూటీ ఎస్‌ఓ గణేష్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో న్యూమోనియా దినోత్సవం

లక్షణాల గుర్తింపునకు సర్వే ప్రారంభం

గొల్లప్రోలు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): న్యూమోనియా లక్షణాలు ఉన్న చిన్నారులను గుర్తించి చికిత్స అందించే సాన్స్ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకూ జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా వైద్యసిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి చిన్నారుల్లో న్యూమోనియా లక్షణాలు గుర్తిస్తారు. గొల్లప్రోలులో రైల్వేస్టేషన్ సచివాలయ పరిధిలో అర్బన్‌హెల్త్‌సెంటర్ సిబ్బంది, ఆశకార్యకర్తలు మంగళవారం ఈసర్వేచేశారు.

జీడికి బీమా..



జీడి పంటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

- పంట నష్టపోతే హెక్టారుకు రూ.80 వేల వరకూ పరిహారం
- రైతులకు భరోసా ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం చర్యలు
- అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

పెద్దాపురం మండలానికి ఓ రైతు 4 ఎకరాల్లో జీడి తోటలు ఉన్నాయి. ఏడాదిపాటు శ్రమిస్తూ పంటను కాపాడుకుంటున్నా వాతావరణ మార్పులతో ఇబ్బందులు నెలకొంటున్నాయి. అధిక ఉష్ణోగ్రత, తేమశాతం పెరగడం, తెలిమంచు, చీడపీడలతో నష్టపోతున్నారు. గత ఐదేళ్లలో పంట దెబ్బతిన్నా పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే తోటలకు బీమా ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. ఈ సమస్య పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం బీమా వర్తింపు చేస్తోంది.

పెద్దాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జీడి రైతులకు అండగా నిలవడానికి కూటమి ప్రభుత్వం చర్యలను చేపట్టింది. తోటలకు పంటల బీమా వర్తింపజేస్తూ నిర్ణయం తీసుకోవడంతో వారికి భరోసా లభించింది. జిల్లాలో జీడి పంట మీద అధికసంఖ్యలో రైతులు ఉపాధి పొందుతున్నారు. టీడీపీ హయాంలో బీమా సదుపాయం ఉండేది. 2019 తర్వాత నిలిపివేయడంతో ఐదేళ్లపాటు అవస్థలు పడ్డారు. రైతుల విజ్ఞప్తి మేరకు కూటమి ప్రభుత్వం బీమా సదుపాయాన్ని పునరుద్ధరించడంతో వారికి మేలు జరిగే అవకాశం ఉంది.

● జీడిపంటకు దిగుబడులు, ఇతర అంశాలతో సంబంధం లేకుండా వాతావరణం ఆధారంగా బీమాపరిహారం చెల్లిస్తారు. అధిక వర్షపాతం, ఉష్ణోగ్రత నమోదు ఇతర వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకుంటారు. ఇందుకు రైతులు సాగుచేసే పంటకు సరిపడా బీమా ప్రీమియం చెల్లించాలి. హెక్టారుకు(2.5ఎకరాలు)కు రూ.4వేలు చెల్లిస్తే బీమా పరిహారం రూ.80వేల వరకూ అందుతుంది. అధికారుల నివేదికలు, ఇతర అంశాలతో సంబంధం లేకుండా వాతావరణ మార్పు ఆధారంగా సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాలకు జమ అవుతుంది.

● రైతులు పట్టాదారు పాసుపుస్తకం/1బి అడంగల్ ఆధారంగా సంబంధిత పోర్టల్‌లో పంట వివరాలు నమోదు చేసుకోవాలి. ఇందుకు ఉద్యానశాఖ అధికారులు మండలస్థాయిలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాకినాడ జిల్లాలో 11,335 ఎకరాల్లో జీడి తోటలు ఉన్నాయి. 80వేల మంది రైతులు జీవనోపాధి పొందుతున్నారు.

15లోగా నమోదు చేసుకోవాలి

జీడి రైతులకు బాసటగా నిలవడానికి ప్రభుత్వం బీమా సదుపాయం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈనెల 15వతేదీ లోపు రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలి. మీ సేవా కేంద్రాల్లో బీమా ప్రీమియం చెల్లించాలి. పంట బీమా ప్రీమియం ఎకరానికి రూ.1500 చెల్లించి నమోదు చేసుకోవాలి. వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకుని పంట నష్టానికి పరిహారం చెల్లించేందుకు అవకాశం ఉంది. జీడి రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే రైతులకు బీమా విషయంలో అవగాహన కల్పించడం కోసం సదస్సులు కూడా నిర్వహిస్తున్నాం.

-సుజాత, ఉద్యానశాఖాధికారిణి, పెద్దాపురం

ఇదీ పరిస్థితి..

జిల్లాలో సాగవుతున్నమొత్తం పంటకు బీమా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. జీడి రైతుల్లో అవగాహన లోపంతో నామమాత్రంగా స్పందన కనిపించడం లేదు. బీమా ప్రయోజనం గురించి అవగాహన కలిగించేలా చర్యలు చేపట్టాలని రైతు సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. గడువు సమీపిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఏవోపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం

- డీపీవో రవికుమార్

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డివిజనల్ పంచాయతీ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న సీహెచ్ వెంకటరెడ్డిపై గత శుక్రవారం డివిజనల్ పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసిన పంచాయతీ కార్యదర్శులు జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఫిర్యాదు ఆధారంగా విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి విచారణ అధికారి నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. డీపీఓను కలిసిన వారిలో కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నాడ నరసింహారావు, కార్యదర్శులు పాండు రంగారావు, ఆర్ఎస్ కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజల వినతులను సత్వరం పరిష్కరించాలి

- డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ మధుసూదన్

పిఠాపురం రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు అందిన వినతులను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్‌డీ మధుసూదన్ సూచించారు. పిఠాపురం మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. మండలాలు, పట్టణాల వారీగా ఉన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి ఆరా తీశారు. ఈనెల 4న పవన్‌కల్యాణ్ నియోజకవర్గంలో పర్యటించిన సమయంలో ప్రజలనుంచి 151 వినతులు అందాయని తెలిపారు. వాటి పరిష్కారం ఎంతవరకూ వచ్చిందో సమీక్షించారు. పవన్ క్షేత్రస్థాయి పర్యటనలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న పనులపై ఆరా తీసి నాణ్యతకు అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, తహసీల్దారు గోపాలకృష్ణ, ఎంపీడీవో చిన్నారావు, మునిసిపల్ కమిషనరు కనకారావు, సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



పిఠాపురంలో అధికారులతో సమీక్షిస్తున్న మధుసూదన్

‘ప్రతిరోజూ తాగునీరు ఇవ్వాలి’

గొల్లప్రోలు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణ ప్రజలకు మూడు, నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు ఇవ్వడం ఏంటని, సమస్య ఎక్కడుందని, ప్రతిరోజూ తాగునీరు ఇవ్వాల్సిందేనని, దీనికి ఏంకావాలో చెప్పాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఓఎస్‌డీ మధుసూదన్ ఆదేశించారు. అధికారులతో కలిసి ఆయన గొల్లప్రోలు పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. తాగునీటి ఇబ్బందుల గురించి పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తాటిపర్తిలోని బోర్లు, పట్టణ శివారులోని ఏలేరు కాలువలోని నీటి ద్వారా తాగునీరు సరఫరా అవుతోందని, మోటార్లు తరచూ మరమ్మతులకు గురవడంతో సమస్య ఏర్పడుతోందని అధికారులు వివరించారు. అనంతరం పట్టణ శివారులో మండల పరిషత్ కార్యాలయంవద్ద డంపింగ్‌యార్డుగా వినియోగిస్తున్న స్థలాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ సీఎం కార్యాలయ అధికారులు శివరామ్, బాలకృష్ణ, నగర పంచాయతీ ఏఈ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 14వతేదీ నుంచి 20వతేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబోయే 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్స్, కరపత్రాలను కలెక్టర్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఏటా నవంబరు 14నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈవారం రోజులు వివిధకార్యక్రమాలు ఉంటాయన్నారు. మొదటిరోజు బాలల దినోత్సవం, పుస్తక పదర్శన, విద్యార్థులకు వివిధ రకాల పోటీల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు, కవిసమ్మేళనం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ ఉప గ్రంథాలయ అధికారి ఇన్‌చార్జి కిషోర్, జిల్లా గ్రంథాలయ సంస్థ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్



చెగోడీలకో.. ఊరు!

ఊరు పేరుమార్చిన ఉపాధి

కాకినాడ కాజ.. తాపేశ్వరం..కాజ..
ఆత్రేయపురం..పూతరేకులు..
రావులపాలెంలో కుండ బిరియానీ..
కండ్రిక కోవా.. పాలకొల్లు పెసరట్టు..
ఇలా ఒక్కో ఊరు ఒక్కో దానికి ప్రసిద్ధి..
మరి చెగోడీలకు.. చెగోడీలకు ఒక
ఊరుందా అని ఆశ్చర్యపోతున్నారా..!
అవును ఉంది..అదెక్కడో కాదండోయ్..
మన కోనసీమ జిల్లాలోని కపిలేశ్వర
పురంలో.. పేరు నారాయణ లంక..
లంక గ్రామమైనా.. చెగోడీల లంకగా ప్రసిద్ధి
చెందింది.. ఒకసారి ఆ ఊళ్లోకి వెళదాం..
వారేం చేస్తున్నారో చూద్దాం..!

- చెగోడీలకు కేరాఫ్ నారాయణలంక
- కపిలేశ్వరపురంలో ఓ కుగ్రామం
- 25 కుటుంబాలకు జీవనాధారం
- ఉద్యాన పంటల నుంచి ఉపాధి వైపు
- ఆర్డర్ల మేరకు సరఫరా
- రోజూ వందల కిలోల తయారీ
- హైదరాబాద్‌లోనూ డిమాండ్

కపిలేశ్వరపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అదొక లంక గ్రామం.. గోదావరి గలగలలతో.. ఆహ్లాదకరమైన వాతావరణంలో అక్కడి ప్రజలు ఒకప్పుడు ఉద్యానపంటలపైనే ఆధారపడి జీవించేవారు.కానీ కాలం మారింది. ఖర్చులు పెరిగాయి.దీంతో పల్లెల్లో కుటుంబాలు పంటల నుంచి వంటల వైపు అడుగులు వేస్తున్నాయి. ఒకరికి ఒకరు తోడై నోరూరించే చిరుతిళ్లు తయారు చేసి విక్రయిస్తూ నాలుగు డబ్బులు సంపాదిస్తున్నారు.ఇలా ఆ గ్రామం చెగోడీ, జంతికల తయారీకి కేంద్రంగా మారి కొందరికి ఆదాయ వనరుగా నిలుస్తోంది. దీనిపై ప్రత్యేక కథనం..



చెగోడీల తయారీ విధానం

ఇక్కడి గ్రామస్తులు చెకోడీ తయారు చేసే విధానం ఇలా ఉంది. వరిపిండి, శనగపిండి ఉడకబెట్టి మిషన్‌లో వేసి ముద్దగా అయిన తర్వాత దాన్ని గంటసేపు వరకూ నానబెడతారు. ఆ తర్వాత దాన్ని ఉండలుగా చేస్తారు. శనగపప్పును శుభ్రంగా కడిగి ఆరబెడతారు. నానబెట్టిన పిండిని ఉండలుగా చేసి పిండిని పొడవుగా తయారు చేస్తూ గుండ్రంగా చుట్టి వాటిపై శనగపప్పును అద్దుతారు. ఆపై కళాయిలో నూనె వేడెక్కిన తర్వాత వాటిని అందులో వేసి వేపుతారు. వేడి తగ్గిన తర్వాత వాటిని ప్యాకింగ్‌లు చేసి అమ్మకాలు సాగిస్తుంటారు.

15 ఏళ్లుగా చెగోడీల తయారీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కపిలేశ్వరపురం పంచాయతీ పరిధిలో నారాయణలంక లంక గ్రామం ఉంది.గోదావరికి ఇటుపక్క కపిలేశ్వరపురం, అటు పక్క నారాయణలంక ఉన్నాయి. కొత్తపేట-ముక్తేశ్వరం రహదారిని చేర్చి ఉన్న గ్రామంలో ఒకప్పుడు కేవలం ఉద్యాన వ్యవసాయమే జీవనాధారం. కానీ 15 ఏళ్లుగా చెగోడీల తయారీతో గ్రామం ప్రసిద్ధి గాంచింది.ఈ గ్రామంలో 289 నివాసాలు ఉన్నాయి. 1200 మంది జనాభా ఇందులో 656 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. అత్యధిక ప్రజలు లంకగ్రామంలోనే ఉన్నారు.

నష్టాలతో మూసివేత

జీవితం అన్నాక ఒడిదుడుకులు.. వ్యాపారం అన్నాక లాభనష్టాలు సహజం.. ఇక్కడ వీళ్లదీ ఇదే పరిస్థితి.. ఎన్నో ఏళ్లుగా చెగోడీల తయారీకి ప్రసిద్ధిగాంచిన ఈ గ్రామంలో తయారీదారులకు ఒక్కోసారి కష్టాలు తప్పడంలేదు. చిన్న పరిశ్రమగా పదుల సంఖ్యలో కుటుంబాలు సొంతంగా వ్యాపారం నిర్వహిస్తున్నప్పటికీ నష్టాల బాట పట్టి కొందరు ఈ రంగాన్ని వీడారు. పెట్టుబడులు ఎక్కువైపోవడం,నిత్యావసర ధరలు, వ్యాపారం సరిగ్గా జరగకపోవడం వంటి కారణాలతో కొందరు తయారీ ఆపేశారు.



ఆర్డర్ల మేరకు సరుకు పంపుతాం



రూ.3లక్షల ఖర్చుతో ఐదేళ్ల క్రితం ఈ వ్యాపారాన్ని ప్రారంభించా. మా కుటుంబీకులు 10మంది పనిచేస్తున్నారు. ఆర్డర్ల మేరకు సరుకు పంపుతాం. రోజుకు 70 కిలోల సరుకు తయారు చేస్తాం. కిలో రూ.130కు విక్రయిస్తాం. లాభాలు అంతంత మాత్రమే.

-సుంకర కోటేశ్వరరావు, నారాయణలంక

ఆశించిన మేర లాభాల్లేవు



వ్యాపారాన్ని 3 నెలల క్రితం ప్రారంభించా. మా కుటుంబమంతా కష్టపడి పని చేస్తున్నాం. తయారు చేసిన సరుకును హైదరాబాద్‌కు పంపిస్తాం. రోజుకు 60 కిలోల సరుకు తయారు చేసి కిలో రూ.140కు సరఫరా చేస్తాం.ఆశించిన మేర లాభాల్లేవ్.

- ఎస్.నాగబాబు, నారాయణలంక

ఎనిమిదేళ్లుగా వ్యాపారం



ఎనిమిదేళ్ల కిందట జంతికల వ్యాపారం ప్రారంభించా. ఐదు కిలోలతో ప్రారంభించిన ఈ వ్యాపారం ప్రస్తుతం 30 కిలోలకు పెరిగింది. సమీపంలోని షోడా, కిరాణా షాపులకు సరుకు తీసుకువెళ్లి వేస్తాం. వచ్చిన సొమ్ముతోనే జీవనం సాగిస్తున్నాం.

- కుప్పాల నాని, నారాయణలంక



దూరప్రాంతాలకు సరఫరా

నారాయణలంక గ్రామస్తుల వ్యాపార ఆలోచన లంక గ్రామానికి బయటవారితో పెనవేసుకుపోయేలా చేసింది. గ్రామంలో దాదాపు 25 కుటుంబాల వారు తమ ఇళ్లల్లోనే చెగోడి, జంతికలు తయారు చేస్తున్నారు. వీరి మార్కెట్ అంతా లంక గ్రామాలకు బయట ఉన్న గ్రామాలతోనే ముడిపడిఉంది.తయారు చేసిన సరుకును వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ఆర్డర్ల ద్వారా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో వ్యాపారం సాగిస్తున్నా రు.కొంతమంది హైదరాబాద్ వంటి ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఇలా గ్రామంలో 15 ఏళ్లుగా చెగోడీ తయారు చేస్తూ జీవనోపాధి పొందుతూ పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

వైకల్యాన్ని బాస్కెట్‌లో.. పడేశాడు!



పట్టుదలతో జయించాడు: బాస్కెట్ బాల్ ఆడుతున్న బధిర దివ్యాంగ యువకుడు ఏసుకుమార్

అన్నీ అవయవాలు సరిగ్గా ఉంటేనే చాలా మందికి ఆటలు ఆడేందుకు సమయం ఉండదు.. అతను అలా కాదు.. దివ్యాంగత్వం ఉన్నా కఠోర శ్రమతో జయించాడు.. వైకల్యాన్ని బాస్కెట్‌బాల్‌తో ఆడేస్తున్నాడు.. అంతర్జాతీయస్థాయిలో తన ప్రతిభ చాటేందుకు ఇటీవల ఆస్ట్రేలియా కూడా వెళ్లి వచ్చిన ఈ పిఠాపురం కుర్రాడికి గురించి తెలుసుకుందాం...

ఆటతో వైకల్యాన్ని జయించాడు..

- వృత్తి వెల్డింగ్.. ప్రవృత్తి బాస్కెట్ బాల్..
- రాష్ట్ర, జాతీయస్థాయిలోపదికి పైగా బహుమతులు
- అంతర్జాతీయ పోటీల్లో సైతం పాల్గొన్న యువకుడు



వెల్డింగ్ పనిచేస్తూ..



పిఠాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అతడి ప్రతిభకు అంగవైకల్యం అడ్డురాలేదు. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా అన్నింటా ముందడుగు వేశాడు. తండ్రి మరణించి కుటుంబపోషణ భారమంతా తనపై పడినా ఆటపై మక్కువ వీడలేదు. వెల్డింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తూనే బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణించడమే కాదు...రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పదికి పైగా బహుమతులు సాధించి ఇప్పుడు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని వచ్చాడు. పిఠాపురం పట్టణానికి చెందిన ఉమ్మిడి ఏసుకుమార్ మూగ, చెముడు సమస్యతో బాధపడుతూ బీకాం వరకూ చదువుకున్నాడు. అయినా ఉద్యోగం రాక వెల్డింగ్ దుకాణంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి వెంకటలక్ష్మితో కలిసి నివసిస్తున్నాడు. పాతబస్టాండు వద్ద గల మునిసిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకూ చదివిన ఏసుకుమార్‌కు ఆ సమయంలోనే బాస్కెట్ బాల్‌పై ఆసక్తి కలిగింది. అక్కడే ఉన్న క్రీడామైదానంలో శిక్షణ పొందుతూ ఆటపై పట్టు సాధించాడు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో బహుమతులు సాధించాడు.

ఉభయ రాష్ట్రాల నుంచి ఒక్కడే ..

రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ వచ్చిన ఏసుకుమార్ తన ఆట ద్వారా దేశానికి పేరు తీసుకురావాలనే దృడసంకల్పంతో ముందడుగు వేశాడు.2016లో జరిగిన రాష్ట్ర స్థాయి యూత్ చాంపియన్‌షిప్ జనరల్ కేటగిరీ విభాగంలో పాల్గొని తొలి బహుమతి సాధించాడు. అక్కడి నుంచి ఏసుకుమార్ పాల్గొన్న ప్రతి పోటీలోనూ రాణిస్తూనే ఉన్నారు. 2017లో మధ్యప్రదేశ్‌లో జరిగిన సబ్‌జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో, 2018లో రాష్ట్ర జూనియర్ చాంపియన్‌షిప్, 2022లో జరిగిన స్టేట్ సీనియర్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జట్టును ప్రథమస్థానంలో నిలపడంలో కీలకపాత్ర పోషించాడు. 2022లో బెంగళూరులో జరిగిన బధిరుల బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నాడు. ఆస్ట్రేలియా మెల్‌బోర్న్‌లో డఫ్ ఇంటర్నేషనల్ బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ (డీఐబీఎఫ్) ఆధ్వర్యంలో ఆసియా, పసిఫిక్ దేశాల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లాడు.ఈ పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక స్థోమత సహకరించకపోవడంతో దాతలు సహకరించారు. మెల్‌బోర్న్‌లో జరుగుతున్న పోటీలకు దేశవ్యాప్తంగా 12 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. అందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఏసుకుమార్ ఒక్కరే ఎంపికవడం అతడి ప్రతిభకు నిదర్శనం. తమిళనాడు నుంచి ఆరుగురు, కర్నాటక నుంచి ముగ్గురు, ఒడిసా నుంచి ఒకరికి అవకాశం లభించింది.

అతడి ఏకాగ్రతే ఈ స్థాయికి చేర్చింది

ఆటలో చూపిన ఏకాగ్రత, ఆత్మవిశ్వాసమే ఏసుకుమార్ అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యేలా చేసింది. ఏ నాడు తనకు ఉన్న లోపాన్ని తలచుకుని బాధపడకుండా సాధారణ క్రీడాకారులతో పోటీపడుతుండడమే అతడ్ని ఇంతవాడ్ని చేసింది.

- బొజ్జా మాణిక్యాలరావు, ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి తొలి నామినేషన్ దాఖలు

- పీడీఎఫ్ అభ్యర్థిగా గోపి మూర్తి

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి రెండోరోజు పశ్చిమ గోదావరిజిల్లా భీమవరానికి చెందిన బొర్రా గోపిమూర్తి మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. ఆయన తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్‌కి నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం ధర్నాచౌక్ రోడ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. పీడీఎఫ్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి మాట్లాడుతూ ఎమ్మెల్సీగా నన్ను గెలిపించిన వెంటనే షేక్‌సాబ్జీ ఆశయాలను సాధించడానికి నిరంతరం పనిచేస్తానన్నారు. పీడీఎఫ్ నిర్మాణాత్మక ప్రతిపక్షంగా శాసనమండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయుల, శ్రామికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానన్నారు. విద్యారంగ పరిరక్షణ కోసం పాటుపడతానన్నారు. అనంతరం ఈ సభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటే శ్వర్లు అధ్యక్షత వహించారు. కృష్ణ, గుంటూరు పీడీఎఫ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మా ట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీగా గోపిమూర్తిని మొదటి ప్రాధాన్యం ఓటు వేయించి భారీ మెజారిటీతో గెలిపించి ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయబ్రహ్మం, యూటీఎఫ్ సీనియర్ నాయకులు చిట్టిబాబు, అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సుబ్బరావమ్మ, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.



పీడీఎఫ్ అభ్యర్థిగా ఉప్యాధాయ ఎమ్మెల్సీకి నామినేషన్‌ను కలెక్టర్‌కు అందజేస్తున్న గోపిమూర్తి

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన
పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల



రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్

కాకినాడ సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను అమరావతి సచివాలయంలో తూర్పు-పశ్చిమ ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఓటర్ల నమోదు ప్రక్రియను రాజశేఖర్ వివరించారు. ఉభయగోదావరి జిల్లాల కూటమి ఇన్‌చార్జి మం త్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, పార్టీ ఇన్‌చార్జిల సహకారంతో ఓటరు నమోదు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి పట్టభద్రులందరికీ అవగాహన కల్పిస్తూ ఓటరు నమోదు జరుగుతుందని తెలిపారు.

శ్రీవీరబ్రహ్మేంద్రస్వామివారి
త్రీడీ విగ్రహం

మండపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేటకు చెందిన దొంతంశెట్టి బాల నాగేశ్వరరావు సూక్ష్మ చిత్ర కళాకారుడు. పట్టణంలో ఉన్న శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 50వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఒక మిల్లీ గ్రాము బంగారం, మిల్లీమీటర్ సైజులో చిన్న సైజు సూది రంధ్రంలో పట్టే విధంగా 3డీ విగ్రహాన్ని సోమవారం తయారుచేసి స్వామి వారికి సమర్పించారు.



బాలనాగేశ్వరరావు తయారు చేసిన వీరబ్రహ్మేంద్రస్వామివారి 3డిచిత్రం

వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.80లక్షలు

ఆత్రేయపురం, నవంబరు12(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. స్వామివారి ఆలయంలో అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు నిర్వహించుకుని మొక్కలు తీర్చుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,80,584 లభించినట్టు ఉపకమీషనరు, ఈవో నల్లం సూర్యచక్రధర రావు తెలిపారు.

- కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక బుధవారం క్షీరాబ్ధిద్వాదశి సందర్భంగా గోదావరినదీలో సాయంత్రం తెప్పోత్సవ కార్యక్రమం కన్నుల పండుగగా నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.



వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మాజీ సీఎం జగన్ ఫొటోతో
ఇన్‌కమ్ సర్టిఫికెట్ జారీ

- కాకినాడలోని గొడారిగుంటలో మీసేవా కేంద్రం నిర్వాహకుడి నిర్వాకం
- మొద్దు నిద్రలో అధికార యంత్రాంగం



మీ సేవా నిర్వాహకులు జారీ చేసిన ఇన్‌కమ్ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్

సర్పవరం జంక్షన్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదునెలలు కావస్తోంది. కానీ, ఇప్పుడు జగన్ ఫొటోతో ఇన్‌కమ్ సర్టిఫికెట్ ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఓ విద్యార్థి ఇన్‌కమ్ సర్టిఫికెట్ కోసం మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకుంటే.. మాజీ సీఎం జగన్ ఫొటోతో ముద్రించి ఉన్న సర్టిఫికెట్ జారీ చేయడంతో ఆ విద్యార్థి విస్తుపోయాడు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సర్పవరానికి చెందిన గురుజు లోహిత్ సాయి కుమార్ విద్యాభ్యాసం కోసం ఇన్‌కం అండ్ అసెట్ సర్టిఫికెట్(ఈడబ్ల్యూఎస్) కోసం కాకినాడ కార్పొరేషన్ 3వ డివిజన్ గొడారిగుంటలోని మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నాడు. ఈనెల 10న ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ 24-25 సంవత్సరానికి చెల్లుబాటు అయ్యేలా కాకినాడ రూరల్ తహశీల్దార్ సిస్ట లక్ష్మీ నరస కుమారి డిజిటల్ సంతకంతో సర్టిఫికెట్ జారీ చేశారు. ఈ సర్టిఫికెట్‌ను మాజీ సీఎం జగన్ ఫొటోతో జారీ చేయడాన్ని గుర్తించి మీసేవా నిర్వాహకుడ్ని అడిగాడు. ఏం పర్వావాలేదు.. కొత్త సర్టిఫికెట్లు అయిపోయాయి. పాత సర్టిఫికెట్‌తో ఇచ్చేశా అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో ఆ బాలుడు విస్తుపోయాడు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న విషయాన్ని సైతం పట్టించుకోకుండా మాజీ సీఎం జగన్ ఫొటోతో సర్టిఫికెట్ జారీ చేయడాన్ని విద్యార్థి తప్పుపట్టాడు. దీనిపై కాకినాడ రూరల్ తహశీల్దార్ కుమారిని వివరణ కోరగా మీసేవా కేంద్రాల నిర్వహణ కలెక్టర్ కంట్రోల్ ఉంటుందని తెలిపారు. ఈ విషయమై తన దృష్టికి వచ్చిందని, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు లేఖ రాశానని తెలిపారు.

ముగిసిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు

- విజేతలుగా నిలిచిన తూర్పుగోదావరి బాలికల జట్లు



అండర్ 19, 17 బాలుర, బాలికల విభాగాల్లో విజేతగా నిలిచిన పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాల జట్లు

ఆత్మకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో మూడు రోజుల పాటు హోరాహోరీగా సాగిన 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాలబాలికల నెట్‌బాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. అండర్ - 19 బాలుర విభాగంలో పశ్చిమగోదావరి, బాలికల విభాగంలో తూర్పుగోదావరి, అండర్-17 బాలుర విభాగంలో విశాఖపట్నం జిల్లాల జట్లు ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాయి. కాగా అండర్ 19 బాలుర విభాగంలో విశాఖపట్నం జట్టు, బాలికల విభాగంలో నెల్లూరు జిల్లా జట్టు, అండర్-17 బాలుర విభాగంలో పశ్చిమగోదావరి జిల్లా జట్టు ద్వితీయస్థానంలో నిలిచాయి. అదేక్రమంలో అండర్-19 బాలుర విభాగంలో తూర్పుగోదావరి, బాలికల విభాగంలో పశ్చిమగోదావరి, అండర్-17 బాలుర విభాగంలో నెల్లూరు జిల్లా జట్ల తృతీయ స్థానంలో నిలిచాయి. విజేత జట్లకు అధికారులు ట్రోఫీని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో కె.గోపాల్, ఆర్‌ఐపీఈ షేక్ మహబూబ్‌బాష, మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ అనంతలక్ష్మీ, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పచ్చా తిరుపతయ్య, పీడీలు ఎన్ ప్రభాకర్‌రెడ్డి, పీ థామస్‌పీటర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మేమున్నాం..

- మహిళా రక్షక్ టీం ర్యాలీ

రాజమహేంద్రవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు ఎస్పీ నరసింహ కిషోర్ ఏర్పాటుచేసిన మహిళా రక్షక్ టీం ప్రతిక్షణం సిద్ధమని శాంతిభద్రతల విభాగం అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు పేర్కొన్నారు. ఆయన పర్యవేక్షణలో సౌత్‌జోన్ డీఎస్పీ భవ్యకిషోర్, మహిళా పీఎస్ సీఐ కె.మంగాదేవి ఆధ్వర్యంలో మంగళవారం మహిళా రక్షక్ టీం పోలీసులు ర్యాలీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఏవీఏ రోడ్, ఆర్టీసీ కాంప్లెక్స్, కోటిపల్లి బస్టాండ్, దేవీచౌక్ గుండా మహిళా పోలీస్ స్టేషను వరకూ ఈ ర్యాలీ సాగింది. మహిళల్లో ధైర్యాన్ని నింపి వారికి పోలీసులు అండగా ఉంటారని భరోసా కల్పించడానికి, వారిపై దాడులను అరికట్టడానికి ఈ అవగాహనా ర్యాలీ చేపట్టామని ఎస్పీ నరసింహ కిషోర్ స్పష్టం చేశారు.



మహిళా రక్షక్ టీం పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పంట కాలువలోకి దూసుకెళ్లిన కారు


పంట కాలువలోకి వెళ్లిపోయిన కారు

ఆత్రేయపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం ప్రధాన కాలువలోకి మంగళవారం ఉదయం ఓ కారు దూసుకెళ్లింది. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం వైపు వస్తున్న కారు అదుపు తప్పి పంట కాలువలోకి దూసుకుపోయింది. ఈ ఘటనను చూసిన స్థానికులు వెంటనే స్పందించారు. అక్కడకు వచ్చి కారును బయటకు తీశారు. దీంతో అందులో వున్న వారంతా సురక్షితంగా బయటపడ్డారు.

భీమేశ్వర స్వామిని దర్శించుకున్న అఘోరీ


భీమేశ్వర స్వామిని దర్శించుకుంటున్న అఘోరీ

సామర్లకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయానికి అఘోరీ సోమవారం రాత్రి ప్రత్యేక వాహనంలో చేరుకుంది. ఆలయ తలుపులు మూసివేసినందున తెల్లవారుజామున రావాలని అధికారులు, పోలీసులు సూచించారు. దీంతో ఆమె మంగళవారం తెల్లవారుజామున ఎరుపు వస్త్రం ధరించి ఆలయంలోకి ప్రవేశించింది. తనదైన శైలిలో భీమేశ్వర స్వామిని ప్రార్థించి వెనుదిరిగింది. మహిళా పోలీసులతో బందోబస్తు చేపట్టారు. అఘోరీతో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.

నేడు సత్యదేవుని తెప్పోత్సవం


పంపా సరోవరంలో సత్యదేవుని విహారానికి సిద్ధం చేసిన హంస వాహనం

సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభం కానున్న తులసిధాత్రి పూజ

రాత్రి ఏడు గంటలకు హంస వాహనంపై పంపా సరోవరంలో విహరించనున్న స్వామి, అమ్మవార్లు

ఏర్పాట్లు పూర్తి చేసిన అన్నవరం దేవస్థానం అధికారులు

అన్నవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి జరిగే వార్షిక వే డుకల్లో అత్యంత ప్రాధాన్యం కలిగిన స్వామివారి తెప్పోత్సవం నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ప్రతిఏటా క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినాన ఈ వేడుక నిర్వహిస్తారు. ఇప్పటికే హంస వాహనాన్ని ముస్తాబు చేశారు. తులసిధాత్రి పూజ జరిపేందుకు పంపా తీరం వద్ద వేదికను సర్వాంగసుందరంగా అలంకరిస్తున్నారు. సాయంత్రం 4.30 గంటలకు రత్నగిరిపై నుంచి స్వామి అమ్మవార్లను, క్షేత్ర పాలకులైన సీతారాములను మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలతో కొండ దిగువున పంపా సరోవరం వద్దకు తోడ్కొనివచ్చి తులసిధాత్రి పూజ చేస్తారు. రాత్రి ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లకు పంపా సరోవరంలో ముమ్మారు ప్రదక్షిణ గావిస్తారు. ప్రముఖులెవ్వరూ కాకుండా వైదిక బృందం మాత్రమే హంసవాహనం ఎక్కేందుకు చర్యలు చేపట్టారు. ప్రముఖులు వీక్షించేందుకు తీరం ఒడ్డున ప్రత్యేక వీఐపీ గ్యాలరీ ఏర్పాటుచేస్తున్నారు. రంగురంగుల విద్యుద్దీపాలు, కళ్లు మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పుల నడుమ తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరగనుంది. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా వచ్చే ప్రజలు ప్రత్యక్షంగాను, వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా భక్తులు పరోక్షంగాను వీక్షించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఫైర్, అంబులెన్స్ వాహనాలు, గజ ఈతగాళ్ళు, లైఫ్ జాకెట్లను సిద్ధం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పర్యవేక్షణలో సుమారు 100 పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

సత్యదేవుని సన్నిధి కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రద్దీగా మారింది. తెల్లవారుజామున రెండు గంటల నుంచి వ్రతాలు, మూడు గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించారు. వేకువజామున నాలుగు గంటలకే స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. సుమారు 6వేల జంటలు సత్యదేవుని వ్రతాలు ఆచరించుకోగా స్వామివారికి వివిధ విభాగాల ద్వారా రూ.65 లక్షల ఆదాయం సమకూరింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సుమారు 30వేల మంది భక్తులకు ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అన్నదాన విభాగం ఏఈవో బి.వెంకటరెడ్డి పర్యవేక్షణలో ఉచిత పులిహోర పంపిణీ చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటల సమయం భక్తులు క్యూలైన్లలో వేచియుండాల్సి వచ్చింది.



తులసిధాత్రి పూజకు సిద్ధమవుతున్న వేదిక, స్వామి దర్శనం కోసం వేకువజామున నాలుగు గంటలకు క్యూలైన్లలో వేచియున్న భక్తులు



జేగురుపాడులో సంపద తయారీ కేంద్రాన్ని సందర్శిస్తున్న ట్రైనీ కలెక్టర్లు, పొట్టిలంకలో ఓ వీధిని శుభ్రపరుస్తున్న ట్రైనీ కలెక్టర్లు

యువ కలెక్టర్ల పల్లె బాట

కడియం మండలం జేగురుపాడు, పొట్టిలంకల్లో క్షేత్ర స్థాయి పర్యటన... సంక్షేమ, అభివృద్ధి పథకాల తీరుతెన్నులు పరిశీలన

కడియం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివిధ రాష్ట్రాలకు చెందిన పది మంది ట్రైనీ కలెక్టర్లు రెండు రోజుల క్షేత్ర స్థాయి శిక్షణలో భాగంగా మంగళవారం తూర్పు గోదావరి జిల్లా కడియం మండలంలో పర్యటించారు. రెండు బృందాలుగా ఏర్పడి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల తీరుతెన్నులను పరిశీలించారు. ఓ బృందం జేగురుపాడు గ్రామాన్ని సందర్శించగా మరో బృందం పొట్టిలంకలో పర్యటించింది. జిల్లా, మండల స్థాయి అధికారులు వారి వెంట ఉండి ఏఏ పథకాలు ఎలా అమలవుతున్నాయో ప్రత్యక్షంగా చూపించారు. తొలుత జేగురుపాడులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించిన అనురాగ్ బాబెల్ (టీమ్ లీడర్), ప్రియారాణి, ఎస్.బేగం, పారత్, కె.భక్తి బృందానికి సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్, ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ స్వాగతం పలికారు. అక్కడ చెత్త సేకరణ, వర్మీకంపోస్టు తయారీ, సేంద్రియ ఎరువుల ఉత్పత్తిని పరిశీలించారు. వాటి పనితీరును జిల్లా పంచాయతీ అధికారి ఎం.నాగలత, డీఆర్డీఏ పీడీ మూర్తి, ఎంపీడీవో రమేష్, ఏవో సుబ్బారావు, ఈవోపీఆర్డీ రాంప్రసాద్ వివరించారు. అనంతరం రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు ఏ విధంగా సహకారం అందిస్తున్నామో జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు డిజిటల్ బోర్డు ద్వారా వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులు, గర్భిణులకు ఆహారాన్ని ఎలా అందిస్తున్నారో పీడీ కె.విజయకుమారి ద్వారా తెలుసుకున్నారు. పిల్లలకు పెడుతున్న ఆహార పదార్థాలను రుచి చూశారు. గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన ఈ బృందానికి డాక్టర్ జ్యోత్స్న గ్రామ స్థాయిలో అందిస్తున్న వైద్య సేవలను వివరించారు. అనంతరం సచివాలయానికి చేరుకుని ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను పరిశీలించి విద్యా విధానంపై ఆరా తీశారు. డ్వాక్రా మహిళలతో సమీక్షించి రుణ సదుపాయం, వినియోగంపై అడిగి తెలుసుకున్నారు. కమ్యూనిటీ హాల్లో వివిధ శాఖలకు సంబంధించి ప్రభుత్వ పథకాల వివరాలను డిజిటల్ స్క్రీన్‌పై ఆయా శాఖల అధికారులు ట్రైనీ కలెక్టర్లకు వివరించారు.

పొట్టిలంకలో ట్రైనీ కలెక్టర్లు నిరంజన్ జయదేవరావు (అసిస్టెంట్ టీమ్ లీడర్), టి.నాగి, ఎ.మిశ్రా, స్నేహ పన్నా పర్యటించారు. వారికి సర్పంచ్ కొత్తపల్లి సత్యవతి, వైస్ ఎంపీపీ కలిదిండి విశాలాక్షి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. డీఎల్డీవో వీణాదేవి, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుజాతకుమారి, వ్యవసాయ శాఖ ఏడీ టీవీఎస్ రెడ్డి, సీడీపీవో కనకవల్లి బృందం వెంట ఉండి ప్రభుత్వ పథకాల అమలు తీరుతెన్నులను వివరించారు. స్థానికులు, లబ్ధిదారులతో మాట్లాడించారు.



కాజ్‌వే మరమ్మతులకు రూ.9.8 లక్షలు మంజూరు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజవొమ్మంగి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలంలో నెల్లిమెట్ల కాలనీ-నెల్లిమెట్ల గ్రామాల మధ్య కాజ్‌వే ఓ వైపు కొట్టుకుపోయిన వైనంపై 'కాజ్ వేపేదీ' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కాజ్‌వే మరమ్మతులకు రూ.9.8 లక్షలు మంజూరు చేశామని, పనులు ప్రారంభమవుతాయని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ డీఈ గౌతమి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి ప్రజలు, ప్రజాప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు నలుగురు ఎంపిక


జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన గౌతమి శిక్షణ శిబిరం క్రీడాకారులు

కొవ్వూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు గౌతమి శిక్షణ శిబిరానికి చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని కొవ్వూరు గౌతమి వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి హరిచరణ్ తెలిపారు. ఈ నెల 9, 10, 11 తేదీల్లో విజయనగరం జిల్లా భోగాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలికల జట్టులో మానికల మహాలక్ష్మి (జంగారెడ్డిగూడెం), కడియం మహాశ్రీలక్ష్మి (ధర్మవరం), బాలుర జట్టులో పి.నవీన్‌కుమార్ (దుద్దుకూరు), యు.ప్రవీణ్ (కొవ్వూరు) ఉత్తమ ప్రతిభ కనబర్చారు. డిసెంబరు నెలలో ఉత్తరప్రదేశ్‌లోని వారాణసిలో జరిగే జాతీయ పోటీల్లో ఈ నలుగురూ రాష్ట్ర జట్టు తరపున ఆడతారని అసోసియేషన్ కార్యదర్శి కొయ్యల ప్రసాద్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన కోచ్‌లు కె.రామ్‌కుమార్, పి.సత్యనారాయణ, ఆర్.సురేష్, పి.గంగాధర్‌లను అభినందించారు. కార్యక్రమంలో కొడాలి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శిశు మరణాల అడ్డుకట్టకు చర్యలు

చింతూరు డివిజన్ అధికార యంత్రాంగాన్ని కదిలించిన 'ఆంధ్రజ్యోతి' కథనం


రామన్నపాలెంలో వైద్య శిబిరంలో చిన్నారిని పరీక్షిస్తున్న తులసిపాకల పీహెచ్‌సీ డాక్టర్ నిఖిల్

చింతూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మన్యంలో చోటుచేసుకుంటున్న శిశు మరణాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికార యంత్రాంగం వరుస చర్యలు మొదలు పెట్టింది. 'మన్యంలో రాలుతున్న పసిమొగ్గలు' శీర్షికన ఈ నెల ఏడో తేదీన ఆంధ్రజ్యోతిలో వచ్చిన ప్రత్యేక కథనం అధికారుల్లో కదలిక తీసుకొచ్చింది. గడచిన ఏడు నెలల కాలంలో చింతూరు డివిజన్లో 49 మంది పసికందులు పొత్తిళ్లలోనే కన్నుమూయడం దయనీయం. మాతా, శిశు మరణాలు చోటుచేసుకోకూడదన్నది లక్ష్యం. కాగా ఏడు నెలల వ్యవధిలోనే చింతూరు డివిజన్లో 49 మంది చిన్నారులు మృత్యువాతపడడమన్నది అంత చిన్న విషయమేమీ కాదు. ఇదే విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ స్పందించారు. ముందుగా డివిజన్ స్థాయి వైద్యులు, వైద్యాధికారులతో పీవో సమావేశమయ్యారు. డివిజన్‌వ్యాప్తంగా ఇంటింటా సర్వేతో పాటు కూడళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని పీవో ఆదేశించారు. ఏడాదిలోపు వయసున్న చిన్నారుల ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీసి అవసరమైతే వెంటనే ఆసుపత్రులకు తరలించాల్సిందిగా పీవో ఆదేశించారు. మారుమూలల్లో, గుట్టలపైన గ్రామాలు ఉండి ఉండడంతో సర్వే పూర్తి చేసేందుకు వారం గడువు ఇవ్వాల్సిందిగా వైద్యులు పీవోని కోరారు.

ఇదిలా ఉండగా నాటు వైద్యం కూడా శిశు మరణాలకు ఒక కారణంగా ఉందని వైద్యులు పీవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సోమవారం డివిజన్లోని దాదాపు వంద మంది నాటు వైద్యులకు అవగాహన సదస్సు నిర్వహించిన విషయం విదితమే. మొత్తంగా పది పీహెచ్‌సీలకు చెందిన 20 మంది వైద్యులు, సిబ్బంది రంగంలోకి దిగి వారి పరిధిలోని చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను పరీక్షిస్తున్నారు.

పెనుగొండ కళాశాలలో 27, 28 తేదీల్లో

అంతర్జాతీయ తెలుగు సదస్సు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నన్నయ విశ్వవిద్యాలయం ఉప కులపతి శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, మద్రాస్ విశ్వవిద్యాలయం, పెనుగొండలోని ఎస్‌వీకేపీ-డాక్టర్ కేఎస్ రాజు ఆర్ట్స్, సైన్స్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. 'విశ్వర్షి వాసిలి వాఙ్మయ వరివస్య' అంశంపై పెనుగొండ కళాశాలలో సదస్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎస్‌వీకేపీ కళాశాల కరస్పాండెంట్ కలిదిండి రామచంద్రరాజు, ప్రిన్సిపాల్ వైవీ అప్పారావు, కళాశాల తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య రంకిరెడ్డి రామ్మోహనరావు, నన్నయ వర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు కేవీఎన్‌డీ వరప్రసాద్ పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడ్డ వ్యక్తి మృతి

గొల్లప్రోలు రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామానికి చెందిన దిమ్మిలి కృష్ణ (36) ఈ నెల 28వ తేదీన సుబాబుల్ చెట్లు నరికే పనిలోకి వెళ్లాడు. చెట్లు నరుకుతూ ప్రమాదవశాత్తు పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనుల పండువగా వేణుగోపాలస్వామి కల్యాణం



పిఠాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణం మంగళవారం రాత్రి కనుల పండువగా జరిగింది. ఉదయం పసుపుకొట్టే కార్యక్రమంలో మహిళలు పాలుపంచుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణాలంకారం జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, స్వామి అమ్మవార్ల పాదుకా ప్రక్షాళన గావించారు. గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి ఆలయం వద్ద లగ్నాష్టకాలు, చూర్ణిక తదితర వేదమంత్రాలతో మంగళవాయిద్యాల నడుమ కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి నున్న శ్రీరాములు పట్టు వస్త్రాలు సమర్పించారు. యాజ్ఞిక బ్రహ్మ సుదర్శనం మాధవ మణికంఠాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవంలో ఆలయ అర్చకుడు పి.విజయజనార్దనాచార్యులు, ఆలయ సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెరుకుపల్లి శ్రీనివాస్, రామ్మోహన్, మల్యాల గోపాలకృష్ణ, అప్పలరాజు, కొల్లూరి లక్ష్మి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.


సూచనలిస్తున్న పీడీజే గంధం సునీత

జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం కావాలి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

రాజమహేంద్రవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. మంగళవారం ఆమె విద్యుత్, కార్మిక, మునిసిపల్ శాఖల అధికారులు, వినియోగదారుల ఫోరం సభ్యులతో సమావేశమయ్యారు. కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడంతో పాటు పలు సూచనలు చేశారు. ఆయా శాఖలు, సంస్థల్లో పెండింగులో ఉన్న సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్, రాజీకి అర్హమైన అన్ని కేసులను గుర్తించి ఆ జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలని ఆమె సూచించారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు పాల్గొన్నారు.



కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ఆర్‌బీ పట్నంలో 'పొలం పిలుస్తోంది'

పెద్దాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌బీ పట్నం గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ నల్లి దైవకుమార్ హాజరై రైతులకు పలు సలహాలు అందించారు. ఏవో కొమ్మోజు సంజయ్‌కుమార్, పశువైద్యాధికారి డాక్టర్ రాకేష్, ఏఈవో రాగస్రవంతి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

ఐసీడీఎస్ పీడీ ప్రవీణ



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ జిల్లా పీడీ ప్రవీణ

సర్పవరం జంక్షన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని, కాకినాడ జిల్లాను బాల్య వివాహాల రహిత జిల్లాగా చేయడమే లక్ష్యంగా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని ఐసీడీఎస్ జిల్లా పీడీ కె.ప్రవీణ కోరారు. మంగళవారం రమణయ్యపేట మండల పరిషత్తు కార్యాలయంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధంపై అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాల వివాహాల సమస్య పరిష్కారం, మైనర్ల సంక్షేమాన్ని ప్రోత్సాహించేందుకు వీలుగా ప్రభుత్వం 2006లో బాల్య వివాహాల నిషేధ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. జిల్లాలో ఇంకా 26 శాతం మేర అక్కడక్కడే బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. మైనర్ అంటే మెజారిటీ చట్టం 1875 ప్రకారం దేశంలో నివసించే ప్రతీ వ్యక్తి పద్దెనిమిది ఏళ్ల వయస్సు పూర్తి కాగానే మేజర్ అవుతాడన్నారు. 18 ఏళ్ల నిండిన స్త్రీ, 21 ఏళ్ల నిండిన పురుషుడు వివాహానికి అర్హుడన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినా, ప్రోత్సహించినా రెండేళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనపై క్షేత్రస్థాయిలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీడీవో పసుపులేటి సతీష్, ఐసీడీఎస్ సీడీపీవో వై.లక్ష్మి, డీసీపీవో వెంకట్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దుర్గాడలో సప్తాహ మహోత్సవాలు ప్రారంభం



దుర్గాడలో ఉత్సవ విగ్రహాలను తీసుకు వెళ్తున్న ఆలయ సేవాసమితి సభ్యులు

గొల్లప్రోలు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో 26వ సప్తాహ మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి సన్నిధిలో 168 గంటల పాటు నిరంతరాయంగా జరిగే ఈ భజన కార్యక్రమాల్లో 56భక్త భజన సమాజాలు పాల్గొననున్నాయి. ఉత్సవాల సందర్భంగా మహాగణపతిపూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, కలశస్థాపన, పార్వతి పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆలయ సేవాసమితి సభ్యులు ఉత్సవమూర్తులను భజనలు జరిగే ప్రాంగణానికి తీసుకువచ్చారు. అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు చేశారు.

వైభవంగా లక్ష బిల్వార్చన

గొల్లప్రోలు రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడలో అయ్యప్పస్వామి లక్షబిల్వార్చన వైభవంగా జరిగింది. దుర్గాడ శివాలయంలో హరిహర సుత అయ్యప్పస్వామికి అయ్యప్పదీక్షాధారులచే లక్ష బిల్వార్చన, మహాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పూజలు, మాలికా పురత్తమ్మపూజలు, పంచలోహ అయ్యప్ప విగ్రహాలకు 18 రకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భజన, పడిపూజా మహోత్సవం జరిగాయి. ద్వారకాతిరుమలకు చెందిన సుదర్శనం దుర్గబాబు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు పూజాది కార్యక్రమాలు జరిపించగా, ఆలయ సేవాసమితి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కార్తీక వనసమారాధన

సర్పవరం జంక్షన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపురం అక్నూఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్ ఆవరణలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. యూనిట్ ముఖ్య అధికారి సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడారు. కోరమండల్ అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు, చిన్నారులతో ఆనందంగా గడిపారు. సామూహికంగా భోజనాలు చేశారు. పేద మహిళలకు కుట్టు మిషన్లు, అంగన్‌వాడీ కేంద్రాలకు సీలింగ్ ఫ్యాన్లు, బాలుడి వైద్య ఖర్చుల కోసం రూ. 15 వేలు ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమంలో మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు వెంకట దుర్గావతి, కార్యదర్శి మల్లీశ్వరి, కోశాధికారి శ్రీదేవి, సభ్యులు లక్ష్మీ, సృజన, మోహినీ కుమారి, లక్ష్మీప్రభ, రత్నం ఉన్నారు.

రీసర్వే గ్రామసభ

గొల్లప్రోలు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): భూములు రీసర్వేలో పలు తప్పిదాలు జరిగాయని వాటిని పరిష్కరించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. గొల్లప్రోలు పట్టణంలోని సీతానగరం రెవెన్యూ గ్రామానికి సంబంధించి రీసర్వే అభ్యంతరాలపై మంగళవారం గ్రామసభ నిర్వహించారు. రైతులు రీసర్వే, ఇతర అంశాలకు సంబంధించి 96 దరఖాస్తులు అందజేశారు. ఇందులో అధికంగా రీసర్వేలో విస్తీర్ణాలు తప్పుడుగా నమోదయ్యాయని 63, జాయింట్ ఎల్‌పీఎంలపై 6, మ్యుటేషన్లపై 26 దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో గొల్లప్రోలు తహశీల్దారు సత్యనారాయణ, రీసర్వే డీటీ మస్తానీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ మృతి

పిఠాపురం రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పిఠాపురం మండలం వెల్దుర్తిలో పనులు చేస్తుండగా ఉపాధి కూలీ మేకల రమణ(55) గుండెపోటుతో మరణించాడు. పనులు చేస్తుండగా కుప్పకూలి అక్కడికక్కడే మరణించినట్టు కూలీలు తెలిపారు. అతడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పెద్ద ఏనుగుల సంబరం

కరప, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వేళంగి గ్రామంలో మంగళవారం రాత్రి పెద్ద ఏనుగుల సంబరం ఘనంగా జరిగింది. ఏటా కార్తీకమాసం శుద్ధ ఏకాదశి రోజున ఈ సంబరాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు తెలిపారు. మెర్ల, మార్ని వంశస్తులు ఏటా సంబరాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా 2 ఏనుగులను రంగురంగుల కాగితాలు, విద్యుత్ దీపాలతో అలంకరించి పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ప్రత్యేక వాహనంలో రాత్రితెల్లవార్లు ఊరేగించారు. వేలాది మంది వచ్చి సంబరాన్ని వీక్షించారు.

'తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదు'

కాకినాడ సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తన ఉనికిని కాపాడుకోవడం కోసం కూటమి ప్రభుత్వంపై వైసీపీ మాజీ మంత్రి కన్నబాబు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని జనసేన జిల్లా నాయకుడు మల్లాడి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాకినాడలో జరిగిన వైసీపీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీపై విమర్శలు చేయడానికి వేదికగా మార్చుకున్నారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం తర్వాత వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కన్నబాబు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు.



పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు

పాదగయలో ప్రత్యేక పూజలు

పిఠాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కార్తీక ఏకాదశి సందర్భంగా పట్టణంలోని పాదగయ క్షేత్రంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు తెల్లవారుజామునే పాదగయకు వచ్చి పుష్కరిణిలో స్నానాలు ఆచరించారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకున్నారు. కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులు తులసిచెట్టు, పుష్కరిణి వద్ద, ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఏర్పాట్లు చేశారు.

భీమేశ్వరాలయంలో...

సామర్లకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస మహాపర్వదినాలను పురస్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్ శర్మ, అంజిబాబు, వెంకన్న తదితరుల వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేకపూజలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచీ అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. లక్షపత్రి పూజల్లో సామర్లకోటకు చెందిన పెనుపోతుల సత్యనారాయణ దంపతులు, కాకినాడకు చెందిన కంతేటి కాశీ దంపతులు ఆసీనులయ్యారు. నిత్యాన్నదాన పథకంలో భాగంగా ఆలయ ఆవరణలో సు మారు 500మందికి అన్నదానం నిర్వహించారు.

అపార్ ఐడీ నమోదు వేగవంతం చేయాలి

కాకినాడ కమిషనర్ భావన



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి అపార్ ఐడీ వివరాలను యూడైస్ ప్లస్‌లో నిక్షిప్తం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ భావన ఆదేశించారు. నగరంలో ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో కమిషనర్ భావన మంగళవారం సమావేశమయ్యారు. ఒక విద్యార్థి ఒక దేశం అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన యూడైస్ ప్లస్ విధానంలోకి విద్యార్థుల వివరాలను నమోదు చేయాలని, విద్యార్థుల సర్వే అపార్ ఐడీ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. విద్యార్థులందరికీ తప్పనిసరిగా అపార్ ఐడీ ఉండాలన్నారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణివ్వడానికి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తుందన్నారు. ఈ క్రమంలోనే విద్యార్థుల విద్యార్హత, విద్యపై సమగ్ర వివరాలను సేకరిస్తుందన్నారు. శుక్రవారం నాటికి కాకినాడ అర్బన్ పరిధిలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థుల అపార్ ఐడీని నూరుశాతం నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఎన్.వెంకటేశ్వరరావు, కాకినాడ అర్బన్ మండల 1,2 విద్యాశాఖాధికారులు ఏఎస్‌కేవీ ప్రేమజ్యోతి, సీహెచ్.రవి, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డీవీఈఓ ఆర్.నూకరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పట్ల నిర్లక్ష్యంగా అధికారులు

టీడీపీ కౌన్సిలర్ల ఆగ్రహం



కమిషనర్‌కు వినతి అందజేస్తున్న కౌన్సిలర్లు

పిఠాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పురపాలక సంఘ పరిధిలో తెలుగుదేశం పార్టీ ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో అభివృద్ధి పనుల నిర్వహణ పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తమ వార్డుల్లో పూర్తిగా అభివృద్ధి పనులు నిలిపివేశారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చినా వైసీపీ వార్డుల్లో తప్ప, తమ వార్డుల్లో పనులు జరగడం లేదని వారు తెలిపారు. తక్షణం తమ వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పిఠాపురం మున్సిపల్ కమిషనరు కనకారావును కలిసి వినతిపత్రం అందజేశారు. వైసీపీ ప్రభుత్వం సమయంలో తాము ప్రాతినిధ్యం వహించే వార్డులపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. ఇప్పుడు కూడా అదే వార్డుల్లో పనులు చేయిస్తూ అధికారులు ఏకపక్షంగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. అటువంటప్పుడు తమ వార్డుల్లో ప్రజల నుంచి ఎందుకు పన్నులు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. టీడీపీ వార్డుల్లో గతంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులన్నింటిని తిరిగి ప్రారంభించాలని, పనుల నిర్వహణలో తమ వార్డులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో అసలు పనులు జరగని ప్రాంతాలను గుర్తించి అక్కడ చేపట్టాలని కోరారు. కౌన్సిలర్లుగా నెగ్గిన తాము మూడున్నరేళ్లుగా పనుల కోసం ఎదురుచూస్తునే ఉన్నామని, అధికారుల సహకరించకపోవడంతో పనులు చేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో టీడీపీ కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, పంపనబోయిన అన్నపూర్ణ, రాయుడు శ్రీను, కోళ్ల బంగారుబాబు, నల్లా రమణమ్మ పాల్గొన్నారు.

రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా డాక్టర్ చప్పిడి



సర్పవరం జంక్షన్, నవంబరు 12 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడ రూరల్ ఇంద్రపాలెనికి చెందిన డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు టీడీపీ రాష్ట్ర ఆరోగ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శిగా పని చేస్తున్నారు. టీడీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేశానని, తనపై నమ్మకంతో డైరెక్టర్‌గా నియమించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు డాక్టర్ చప్పిడి కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ ద్వారా శెట్టిబలిజ సామాజికవర్గం ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తానన్నారు.

అగ్ని కులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కుమారస్వామి

రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తూరంగి గోపీకృష్ణాకాలనీకి చెందిన జనసైనికులు తిరుమాని కుమారస్వామి నియమితులయ్యారు. తనకు పదవి వచ్చేలా కృషి చేసిన ఎమ్మెల్యే నానాజీకి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కుమారస్వామి కృతజ్ఞతలుతెలిపారు.

శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా లక్ష్మణరావు



తాళ్లరేవు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అభివృద్ధి, శెట్టిబలిజ సంక్షేమానికి కృషిచేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టేకుమూడి లక్ష్మణరావు అన్నారు. ఆయన కోరింగ పంచాయతీ మాజీ సర్పంచ్‌గా, తాళ్లరేవు మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడిగా, తాళ్లరేవు టీడీపీ మండలాధ్యక్షుడిగా సేవలందించారు. తనకు డైరెక్టర్ పదవిని కేటాయించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా జగదీష్



పిఠాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి చెందిన పెంకే జగదీష్ నియమితులయ్యారు. తనకు అప్పగించిన పదవి న్యాయం చేస్తానని జగదీష్ తెలిపారు. తనకు అవకాశం కల్పించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, జనసేన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా వెంకటేష్



సామర్లకోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సామర్లకోట మండలం మాధవపట్నంకు చెందిన టీడీపీ నాయకుడు పెంకే వెంకటేష్‌ను నియ మితులయ్యారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ రగ్బీ పోటీలకు పిఠాపురం విద్యార్థిని ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో

పిఠాపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయస్థాయి రగ్బీ పోటీలకు పిఠాపురం విద్యార్థిని ఎంపికైంది. పట్టణంలోని బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు పి.మనోజ్ఞలక్ష్మీశ్రీ, పి.భవ్యశ్రీ, ఆర్. విజయలక్ష్మి, కె.దుర్గాలక్ష్మి కడపలో ఈనెల 9,10,11వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా మనోజ్ఞలక్ష్మీశ్రీని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఆమెను మంగళవారం హెచ్ఎం, ఎంఈవో శ్యాంబాబు, పీడీ శేషకుమారి, పీఈటీ సత్యప్రియ అభినందించారు.

వెండి వడ్డాణం బహూకరణ



వడ్డాణం బహూకరిస్తున్న దాతలు

పెద్దాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మరిడమ్మ దేవస్థానంలో పట్టణానికి చెందిన దాతలు గేదెల వీరవెంకట సూర్యకిరణ్, విహారిక దంపతులు ఉత్సవ మూర్తికి వెండి వడ్డాణం బహూకరించినట్టు అసిస్టెంట్ కమీషనర్ కురం విజయలక్ష్మీ తెలిపారు. వడ్డాణానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరించినట్లు తెలిపారు. దాతలకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందచేశారు.

కంప్యూటర్లు వితరణ

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ సాలిపేట గర్ల్స్ హైస్కూల్‌కి ఐడీబీఐ బ్యాంకు సామాజిక బాధ్యతలో భాగంగా సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి 2 కంప్యూటర్లను మంగళవారం ప్రధానోపాధ్యాయురాలు సుబ్బలక్ష్మికి అందజేశారు. కంప్యూటర్లను డీవైఈవో వెంకటేశ్వరరావు, ఎంఈవో రవి ప్రారంభించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ దొరబాబు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలు వాయిదా

పెద్దాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15,16,17 తేదీల్లో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలు వాయిదా పడినట్లు సీపీఎం నాయకుడు నీలపాల సూరిబాబు తెలిపారు. స్థానిక వరహాలయ్యపేటలో ఉన్న యాసలపు సూర్యారావు భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమావేశాలను అనివార్య కారణాల రీత్యా వచ్చే నెల 20,21,22 తేదీకి మార్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో దారపురెడ్డి క్రాంతి కుమార్, సిరిపురపు శ్రీనివాస్, గడిగట్ల సత్తిబాబు, చల్లా విశ్వనాథం, కృష్ణ, వీర్రాజు, నరసింహమూర్తి, నాగు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం అడ్డగింత

తాళ్లరేవు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చొల్లంగిపేట సర్వేనెంబర్ 42లో నాన్‌లేఅవుట్‌లో అక్రమ నిర్మాణం చేస్తుండగా పంచాయతీ అధికారి సాంబయ్య మంగళవారం అడ్డుకున్నారు. లేఅవుట్ నిర్మాణానికి ఏ అనుమతులు లేవని ఇక్కడ ఏ నిర్మాణాలు చేపట్టరాదని తెలిపారు. పంచాయతీకి చెల్లించాల్సిన పన్నులు చెల్లించి నిర్మాణాలను చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి నిర్మాణం చేస్తే క్రిమినల్ కేసులు నమోదుచేస్తామన్నారు.

'పనులు చేసుకునే వెసులుబాటు కల్పించాలి'



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శిలు

కాకినాడ సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఏఎన్ఎంలకు జాబ్‌చార్ట్‌లో పేర్కొన్న విధుల కాకుండా ఇతర కార్యక్రమాలకు కేటాయించరాదని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు అమలు చేయాలని, వారి అత్యవసర విధులు, జాబ్ చార్ట్‌లో ఉన్న పనులు చేసుకునే వెసులుబాటు కల్పించాలని ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుద్దటి రామ్మోహనరావు, పేపకాయల వెంకటకృష్ణ కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్ మోహన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వీరి అభ్యర్థనపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అసోసియేషన్ సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, కరప యూనిట్ అధ్యక్షుడు బి.రవి, మహిళా విభాగంచైర్‌పర్సన్ సుజాత ఉన్నారు.

జూడో పోటీల్లో 'ఐడియల్' విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న కరస్పాండెంట్ చిరంజీవినీకుమారి

కాకినాడ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అంతర కళాశాలల జూడో పోటీలలో కాకినాడ ఐడియల్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి ఓవరాల్ ఛాంపియన్స్‌గా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ తెలిపారు. అంతే కాకుండా మహిళల విభాగంలో ఉషానాగబాల, తేజస్విని, వైష్ణవి జూడోలో విజేతలుగానూ, అదే విధంగా పురుషుల విభాగంలో టి.పవన్‌కుమార్ స్వర్ణపతకం, విజయ్, హరికిరణ్‌లు కాంస్యపతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను కరస్పాండెంట్, కార్యదర్శి డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి, అకడమిక్ డైరెక్టర్ మెర్ల రంజిత్, వైస్‌ప్రిన్సిపాల్ స్టీవెన్ రాజు,నాగేశ్వరరావు, పీడీ శ్రీను అభినందించారు.

అథ్లెటిక్స్‌లో పతకాలు

కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సూరంపాలెం ఆదిత్యలో నిర్వహించిన జేఎన్టీయూకే సెంట్రల్ జోన్ పోటీల్లో ప్రతిభ కనబరచి అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీకాంత్ తెలిపారు. కళాశాల ఈసీఈ విద్యార్థిని ఎ.మౌనిక 800, 1500 మీటర్ల పరుగులో బంగారుపతకాలను సాధించి అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైందన్నారు. ఐశ్వర్య, స్నేహ, శిరీషా, మౌనిక 400 మీటర్ల రిలేలో రజతపతకాన్ని, ఐశ్వర్య 800 మీటర్ల పరుగులో కాంస్య పతకాన్ని పొందిందని తెలిపారు. వారిని కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు, డైరెక్టర్ కృష్ణంరాజు, ఏవో వర్మ, పీడీ డాక్టర్ కాశయ్య, పీఆర్వో సాయిబాబు అభినందించారు.

'ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు'

కాకినాడ క్రైం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు అంధకారమయం అవ్వడంతోపాటు కఠిన చర్యలు తప్పవని కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు అన్నారు. కాకినాడ రంగరాయ వైద్యకళాశాల ఆడిటోరియంలో మంగళవారం ర్యాగింగ్ నిరోధంపై విద్యార్థులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌డీపీవో మాట్లాడుతూ వైద్య విద్య, ఇంజనీరింగ్ విద్య సమాజ శ్రేయస్సును, సమాజ భవిష్యత్తును నిర్ణయిస్తాయన్నారు. అటువంటి విద్యలో ర్యాగింగ్ భూతం కనిపిస్తే ర్యాగింగ్‌కు పాల్పడినవారు, బాధిత విద్యార్థులు మానసిక వ్యథతో తమ విద్యను కోల్పోతున్నారన్నారు. ఇటీవల ర్యాగింగ్‌కు పాల్పడిన వైద్య విద్యార్థి ఏడాదిపాటు సస్పెన్షన్‌కు గురికావడం ఆ విద్యార్థి భవిష్యత్తుకు ఎంతో అడ్డంకి అన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కళాశాలల యాజమాన్యం అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసి ర్యాగింగ్ వల్ల నష్టాలను తెలియజేయాలన్నారు. సదస్సులో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వరరావు, అధిక సంఖ్యలో వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుపై కోత మిషన్ మట్టి

కొత్తపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి గోర్స పండూరు రోడ్డుపై కోత మిషన్ చైన్ మట్టి పెళ్లలు కరిగి వాహనదారులు జారిపడిపోయారు. ఇటీవల గ్రామాల్లో చేలల్లో త్వరగా వరికోతలు పూర్తి చేయాలన్న ఆలోచన కోత మిషన్లతో కోత కోయించుకున్నారు. చేలల్లో నీరు ఆరకపోవడంతో బురదలోనే కోత మిషన్ చేలో దిగి కోత పూర్తి కాగానే రోడ్డుకు చేరేటపుడు బెల్ట్‌కు ఉన్న మట్టి పెళ్ళలు రోడ్డుపై చిందర వందరగా పడుతున్నాయి. సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి రోడ్డుపై ఉన్న చేలల్లో మట్టి కరిగి బైక్‌లపై ప్రయాణిస్తున్న పలువురు మంగళవారం గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కర్రి చిన్నారావు కూలీలతో రోడ్డుపై ఉన్న బురదను తొలగించే ఏర్పాట్లు చేశారు.



గోర్స రోడ్డులో బురదను శుభ్రం చేస్తున్న దృశ్యం

కొంగోడులో అక్రమ చెరువుల తవ్వకాలపై నిరసన



ఆందోళన చేస్తున్న కొంగోడు గ్రామస్తులు

కరప, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కొంగోడు గ్రామంలో ఎస్సీపేటను చేర్చి అక్రమంగా ఆక్వా చెరువులు తవ్వుతున్నారంటూ పలువురు గ్రామస్తులు నిరసనకు దిగారు. స్థానిక ఎస్సీపేటవాసులు మంగళవారం కరప చేరుకుని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన మేడిశెట్టి రామకృష్ణ అనే వ్యక్తి ఎస్సీపేటను చేర్చి అనధికారికంగా చెరువులను తవ్వుతున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. గతంలో తవ్విన చెరువుల వల్ల భూగర్భ జలాలు కలుషితమైపోయాయని, చెరువుల్లో చనిపోయిన రొయ్యలు, వ్యర్థాల వల్ల దుర్వాసన వ్యాపిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. చెరువుల్లోని రేడియేటర్లు, జనరేటర్ల వల్ల ఉత్పన్నమవుతున్న శబ్దాలకు రాత్రుళ్ళు నిద్రపట్టడంలేదని, చుట్టూ ఉన్న ఇటుక బట్టీల వల్ల ఇప్పటికే పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నామని మాజీ సర్పంచ్ వింత అప్పారావు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు అనుమతులు లేకుండా తవ్వుతున్న చెరువులను అడ్డుకోవాలని, గతంలో తవ్విన చెరువులను, చుట్టూ ఉన్న ఇటుకబట్టీలను తొలగించాలని 200మంది సంతకాలతో కూడిన ఫిర్యాదు పత్రాలను డిప్యూటీ తహశీల్దార్, కరప పోలీసులకు అందజేశారు. కలెక్టరేట్‌కు చేరుకుని కలెక్టర్‌కు ఫిర్యాదుచేసినట్టు తెలిపారు.

సూర్యారావుపేటలో తాగునీరు సరఫరా

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

సర్పవరం జంక్షన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ సూర్యారావుపేట మత్స్యకార గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రజలకు తాగునీరు సరఫరా చేశారు. గొంతెండిపోతోంది శీర్షికన సూర్యారావుపేటలో వారం రోజులుగా అందని తాగునీరు శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పండూరు సమగ్ర రక్షిత తాగునీటి పథకం నుంచి సూర్యారావుపేటకు వచ్చే ప్రధాన పైపులైన్‌కి ఏర్పడ్డ లీకేజీకి మరమ్మతులు పూర్తి చేసిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ టి మారుతీరావు గ్రామస్థులకు తాగునీరు సరఫరా చేశారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్లు ఏఈ మారుతీరావు తెలిపారు. పైపులైన్ల మరమ్మతులను పూర్తి చేసి తాగునీరు సరఫరా చేశామన్నారు. సమస్య పరిష్కారం కావడంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు.

'కేంద్రం పథకాలపై అవగాహన కల్పించాలి'

కొత్తపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం రాష్ట్రాలకు అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పిఠాపురం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ వాసంశెట్టి శ్రీనివాస్ విజ్ఞప్తి సూచించారు. కొండెవరంలో మంగళవారం జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల బూత్‌కమిటీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బుర్రి మురళీధరరావు మాట్లాడుతూ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా మండలంలో బూత్‌కమిటీలు ఏర్పాటు చేసి కేంద్ర సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండల రావు, రాష్ట్ర వీవర్స్ సెల్ కో కన్వీనర్ రవణం సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు మేడ సాని వరలక్ష్మీనారాయణ, కొమ్మినేడి భద్రరావు, గుత్తుర్తి గోవిందు, వెంకటరమణ, కాకర్ల బాబి, అడబాల వీరమోహన్,గౌరీ పాల్గొన్నారు.

ఉచితంగా కోచింగ్ మెటీరియల్ అందజేత

కాకినాడ రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పైడా వెంకటనారాయణ సేవా సంస్థ ద్వారా ఇంజనీరింగ్ (ఏపీఈఏపీసెట్) మెడికల్ (నీట్) ప్రవేశ పరీక్షలకు ఉపయోగపడే కోచింగ్ మెటీరియల్‌ను మంగళవారం సంస్థ అధినేత పి.వెంకటేశ్వరరావు చేతులమీదుగా ఉచితంగా అందజేశారు. తమ సంస్థ ద్వారా గతంలో కళాశాలకు 6తరగతి గదులు నిర్మించామని.. ఎంపీసీ, బైపీసీలలో ప్రతిభ కనబరచి ఎక్కువ మార్కులు సాధించిన 100 మంది విద్యార్థులకు ఈ మెటీరియల్ అందజేస్తున్నామని ప్రభుత్వ కళాశాలలో ప్రవేశపరీక్షలకు ఉచితంగా కోచింగ్ చెప్పడం అభినందనీమన్నారు. ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికైన ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతుల రాంబాబును సత్కరించారు. డీఐఈవో జీజీకె నూకరాజు, ప్రిన్సిపాల్స్ తిరుపతి, మూర్తిరాజు, అధ్యాపకులు ఉన్నారు.

కోలాహలంగా నగర సంకీర్తనలు

ప్రత్తిపాడు, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస పర్వదినాలు పురస్కరించుకుని మండలంలోని గ్రామాల్లో నగర సంకీర్తనలు నిర్వహిస్తున్నారు. గోమాతకు పూజలు నిర్వహించి పురవీధుల్లో ఊరేగిస్తూ భజన గేయాలతో కోలాహలంగా మండలంలోని ధర్మవరం, ఏలూరు, రాచపల్లి, తదితర గ్రామాల్లో ఈ నగర సంకీర్తనలు నిర్వహించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



ఆటో ద్వారా ప్రచారం చేస్తున్న ఆదివాసీ నాయకులు

15న బిర్సా ముండా జయంతి

చింతూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తులసిపాకలలో ఈ నెల 15న బిర్సా ముండా జయంతి నిర్వహిస్తున్నట్టు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం చిన్నవీరభద్రం పేర్కొన్నారు. దీని విజయవంతానికి ఊరూరా ఆటో ద్వారా ప్రచారం చేస్తున్నామన్నారు. మంగళవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివాసీ గ్రామ పెద్దలకు, సంప్రదాయ పూజారులకు గౌరవ వేతనంగా నెలకు రూ.10 వేలు వంతున ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మన్యంలో నీటిపారుదల కోసం ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధిపర్చాలన్నారు. ఆదివాసీ నిరుద్యోగుల కోసం ప్రత్యేక జీవో తీసుకొచ్చి మన్యంలో నూటికి నూరు శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ఆదివాసీలకే కేటాయించాలని కోరారు. ప్రచారంలో ఆదివాసీ నాయకులు కుంజా శ్రీను, పొడియం లక్ష్మణరావు, సోడి రాఘవయ్య, కారం సంకురమ్మ, నూప నరేంద్ర పాల్గొన్నారు.

'మాదిగలంతా ఐక్యంగా ఉండాలి'

రాజవొమ్మంగి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మాదిగలంతా ఐక్యంగా ఉంటే ఏమైనా సాధించగలమని ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల అధ్యక్షుడు ముమ్మిడివరపు చిన్న సుబ్బరావు పేర్కొన్నారు. మంగళవారం రాజవొమ్మంగిలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహ ప్రాంగణంలో ఎమ్మార్పీఎస్ జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. సుబ్బరావు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో వున్నా ఏజెన్సీలోని మాదిగలకు న్యాయం జరగట్లేదన్నారు. మందకృష్ణ మాదిగ 30ఏళ్ల పోరాటం ఫలితంగా ఎస్సీ వర్గీకరణ జరగనుందన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మోర్త బుజ్జిబాబు, మండల శాఖ అధ్యక్షుడిగా పెద్దాడ నూకరాజు, రాష్ట్ర కార్యదర్శిగా నిడమర్తి చినబాబులను ఎన్నుకున్నారు. టీడీపీ రాజవొమ్మంగి మండల శాఖ అధ్యక్షుడు, లబ్బర్తి ఎంపీటీసీ గొల్లపూడి



నూతనంగా బాధ్యతలు చేపట్టిన అధ్యక్షులను సన్మానిస్తున్న దృశ్యం

పెద్దిరాజు మాట్లడుతూ పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు.

ఉద్యానవన మొక్కల సాగుకు చర్యలు

రంపచోడవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఉద్యానవన పంటల సాగుకు చర్యలు చేపట్టామని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. మంగళవారం ఆయన హెచ్‌ఎన్‌టీసీలో జీడిమామిడి, మామిడి, జాఫ్రా మొక్కలకు అంటు కట్టే ప్రక్రియను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన రైతులకు ఉద్యానవన పంటలు ప్రోత్సహించేలా చర్యలు చేపట్టామని, వచ్చే ఏడాదికి 50వేల మొక్కలను సబ్సిడీపై రైతులకు సరఫరా చేసే విధంగా ప్రతిపాదనలను సిద్ధం చేశామన్నారు. మారేడుమిల్లిలో ఉద్యానవన, రబ్బరు మొక్కల అంట్లు కట్టే నర్సరీలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి కె.చిట్టిబాబు, సబ్ అసిస్టెంట్లు భీమన్న, నూకరాజు పాల్గొన్నారు.



హెచ్‌ఎన్‌టీసీలో అంట్లు కట్టే ప్రక్రియను ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కూనవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు లైబ్రేరియన్ గోవిందరాజు తెలిపారు. 14న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం, బాలల దినోత్సవం, 15న మాదకద్రవ్యాలపై అవగాహన, పుస్తకాల ప్రాముఖ్యత, 16న గ్రంథాలయ ఉద్యమంలో ప్రముఖులైన డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం, ఎ.వెంకటరమణయ్య తదితరులపై చర్చ, 17న రచయితల సందేశాలు, 18న వక్తృత్వ పోటీలు, క్రీడా పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న 'డిజిటల్ గ్రంథాలయాలు, చదువంటే మాకిష్టం'పై అవగాహన సదస్సు జరుగుతాయి.

వై.రామవరం (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు వై.రామవరం శాఖా గ్రంథాలయ అధికారి జర్తా సత్యవతి తెలిపారు. 14న వారోత్సవాలు ప్రారంభం, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖులను స్మరించుట, 17న రచయితల సందేహాలు, సెమినార్లు, కవి సమ్మేళనాలు, 18న వక్తృత్వం, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న ముగింపు వేడుకలు జరుగుతాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరుకావాలని సత్యవతి కోరారు.



వాలీబాల్ పోటీలో తలపడుతున్న విద్యార్థినులు

విద్యార్థులకు ఆటల పోటీలు

మోతుగూడెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మోతుగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పీఈటీ రాజేశ్వరి ఆధ్వర్యంలో బాలబాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 14వ తేదీన జరిగే కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామని ప్రధానోపాధ్యాయుడు సంసన్ తెలిపారు. ఉపాధ్యాయులు కవిత, సుజాత, సన్యాసిరావు, శాంతిబాబు పాల్గొన్నారు.

సైబర్ మోసాల నివారణపై అవగాహన

దేవీపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగుళూరు గ్రామంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. గంజాయి, బెల్టు షాపులు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాల నివారణపై దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ అవగాహన కల్పించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

అభివృద్ధే ధ్యేయంగా రూపుదిద్దుకున్న బడ్జెట్

రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిన జగన్

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలు, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్ రూపుదిద్దుకుందని టీటీడీ బోర్డు మెంబర్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఆయన మంగళవారం జగ్గంపేట కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటిసారిగా ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. అన్ని రంగాలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ కేటాయింపులు చేయడం కూటమి ప్రభుత్వం ముందు చూపునకు నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ పథంలో ముందుకు నడిపేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వం పూర్తిగా ప్రజల ప్రభుత్వం అని తెలిపేందుకు రాష్ట్రబడ్జెట్ నిదర్శనమన్నారు. ప్రజల ఆమోదయోగ్యంగా ఉందని, పెట్టుబడులు ఆకర్షించేందుకు ఉపయోగపడుతుందని వివరించారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిందని, వైసీపీ ప్రభుత్వం చేతగాని పాలనలో రాష్ట్రాన్ని నాశనం చేశారన్నారు. సాక్షి పేపర్లో వచ్చిన బడ్జెట్ విశ్లేషణపై ఎమ్మెల్యే నిప్పులు చెరుగుతూ ప్రతిఅంశాన్ని విశ్లేషించారు. అసెంబ్లీకి వచ్చి బడ్జెట్‌పై ప్రశ్నించే దమ్ము జగన్‌కు లేకే అసెంబ్లీకి రావడంలేదని, అనేక మంది ఇద్దరి ముగ్గురితో కూడా అసెంబ్లీలో పోరాడారని 11 మంది ఎమ్మెల్యేలతో ఉన్న జగన్ గెలిచిన ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు. తమ నియోజకవర్గంలో సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించలేని స్థితిలో వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో మారిశెట్టి భద్రం, పోతుల మోహన్‌రావు, మంగరౌతు రామకృష్ణ, కొత్త కొండబాబు, పీపీ ప్రసాద్,దాసరి తమ్మన్న దొర, అడపా తాతాజీ, వేముల కొండ జోగారావు, గోడే బాల పాల్గొన్నారు.



అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను చూపిస్తున్న ఎమ్మెల్యే

వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో విజయలక్ష్మి ప్రతిభ



విజయలక్ష్మిని అభినందిస్తున్న దృశ్యం

తుని రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తునిలో డిగ్రీ కళాశాలలో బీకాం 3వ సంవత్సరం విద్యార్థిని జి.విజయలక్ష్మి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చాటింది. ఈ నెల 10,11న తాడేపల్లిగూడెంలో జరిగిన ఆదికవి నన్నయ ఇంటర్‌కాలేజి ఎట్ యూనివర్శిటీ జూడో సెలక్షన్ కం టోర్నమెంట్‌లో 75 ప్లస్ కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. ఆదికవి నన్నయ ఇంటర్‌కాలేజి తరుపున ఇంటర్ యూనివర్శిటీ జూడో మెన్, ఉమెన్ టోర్నమెంట్ విభాగంలో మధ్యప్రదేశ్ భూపాల్‌లో పోటీల్లో పాల్గొనే అర్హత సాధించింది. ఈ సందర్భంగా విజయలక్ష్మిని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. లలిత, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, హెచ్‌వోడీ బి.నాగరాజు, ఫిజికల్ డైరెక్టర్ సానా రాజేష్‌కుమార్, అధ్యాపకబృందం అభినందించారు.

అంబేడ్కర్ విగ్రహానికి నివాళి

కిర్లంపూడి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి కాపుల వీధి రామాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహం ఏర్పాటు చేసి ఏడేళ్లు పూర్తికావడంతో ముద్రగడ అభిమానులతో విగ్రహం వద్దకు చేరుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలను కొనియాడారు.

104 సిబ్బంది నిరసన

కిర్లంపూడిలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద 104 ఉద్యోగులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఉంచి నిరసన తెలిపారు. పదహారేళ్లుగా 104లో ఉద్యోగులుగా పనిచేస్తూ ప్రజలకు సేవలందిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు ఇప్పించాలని వారు డిమాండ్ చేశారు.

సేవా అవార్డుకు ఎంపిక

తుని రూరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తుని మండలంలో తిమ్మాపురం గ్రామానికి చెందిన ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ వ్యవస్థాపకుడు పెంకే దుర్గాప్రసాద్‌కు జాతీయస్థాయి భారత సేవా రత్న అవార్డుకు ఎంపికయ్యారు. కర్నాటక రాష్ట్రానికి చెందిన సోమలరాజు ఫౌండేషన్ ఈనెల 14న అన్నమయ్య జిల్లా మదనపల్లెలో దుర్గాప్రసాద్‌కు అవార్డు అందజేయనుంది.

ధాన్యాభిషేకం

ప్రత్తిపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాచపల్లిలో అరుణాచలేశ్వరునికి కార్తీక శుద్ధ ఏకాదశి పురస్కరించుకుని ధాన్యాభిషేకం నిర్వహించారు. రమణ సేవాశ్రమ నిర్వాహకులు రామానంద స్వామి ఆధ్వర్యంలో చేపట్టారు.



రాచపల్లిలో అరుణాచలేశ్వరునికి ధాన్యాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు

పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

జగ్గంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు మహిళలు, చిన్నారుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు హెచ్చరించారు. కాట్రావులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మహిళా చట్టాలు, హక్కులు, బాలబాలికల రక్షణ పట్ల జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాథరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎస్పీ శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ హాజరయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌లపై మహిళా పోలీస్ సిబ్బంది ద్వారా వివరించారు. సోషల్ మీడియాలో అశ్లీల, అసత్య పోస్టులను పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫేక్ అకౌంట్ ద్వారా సోషల్ మీడియాలో చట్టవ్యతిరేక పోస్టులను పెట్టినా, ఫార్వర్డ్ చేసినా చర్యలు తప్పవన్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు రోడ్డుకి పక్కగుండా నడుస్తూ జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రేమ పేరుతో వంచన చేసే నయవంచకుల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. తోటి విద్యార్థుల పట్ల ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం గోపాలకృష్ణ, వీడీ శ్రీనివాసరావు, మహిళా పోలీసులు, అధ్యాపకబృందం ఉన్నారు.

తీరంలో అలల ఉధృతి

తొండంగి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తీరంలో అలల ఉధృతి పెరిగింది. గాలుల తీవ్రత పెరగడంతో కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. అల్పపీడనానికి సంబంధించిన సమాచారం ఉండడంతో మత్స్యకారులు వలలు, ఇతర పరికరాలను సురక్షిత ప్రాంతంలో భద్రపరుచుకుంటున్నారు. మండలంలో అద్దరిపేట నుంచి చోడిపల్లిపేట వరకూ తీరప్రాంతంలో ఇదే పరిస్థితి ఉంది. మంగళవారం ఉదయం నుంచి మాగుడు వాతావరణం కనిపించింది. దీంతో వరి చేలను ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు ఉన్నారు.



అద్దరిపేట తీరంలో సముద్ర అలలు

పంట బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



శంఖవరం: ధారమల్లాపురంలో మాట్లాడుతున్న ఏవో

శంఖవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి. గాంధీ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం ధారమల్లాపురం, పోలవరం గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం, పంటలలో చీడపీడల నివారణలపై రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏఈవో మౌళిప్రసాద్, మణికంఠ, తాతబాబు, నాగేంద్ర తదితరులున్నారు.

కోటనందూరు: రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని మండల వ్యవసాయధికారి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని పాత కొట్టాంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో శివకుమారి, రైతులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ముగిసిన అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్

గండేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెంలో ఆదిత్య ఇంజనీరింగ్ ప్రాంగణంలో కాకినాడ జేఎన్టీయూకే సెంట్రల్ జోన్ పరిధిలోని కళాశాలల అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ 2024 పోటీలు విజయవంతంగా ముగిశాయి. పురుషుల విభాగంలో ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల, మహిళల విభాగంలో ఎస్.ఆర్ గుడ్లవల్లేరు కళాశాల, మెన్ అండ్ విమెన్ ఛాంపియన్‌గా ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విజేతలుగా నిలిచారు. ఆదిత్య యూనివర్శిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేఎన్టీయూకే టోర్నమెంటు పరిశీలకులు అథ్లెటిక్ కోచ్ పీపీవి ప్రసాద్‌రెడ్డి, ఆదిత్య కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రమేష్ చేతుల మీదుగా విజేతలకు మెమోంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. డీన్‌లు వి.సత్యనారాయణ, ఎకె.సుబ్బారావు, పీఈటీ అసోసియేషన్ నాయకులు నూకరాజు, ఈవెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రవి పాల్గొన్నారు. ఓవరాల్ ఛాంపియన్‌గా ఆదిత్య నిలిచింది.

ఘనంగా చీడికమ్మ జాతర

తుని రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామాలైన కేవో మల్లవరం, రాపాక, దొండవాక గ్రామదేవతగా పూజలందుకుంటున్న చీడికమ్మ జాతర వేడుకలు ఆయా గ్రామాల్లో ఘనంగా జరుగుతున్నాయి. వేలాది మంది భక్తులు వస్తున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీలు విద్యుత్ అలంకరణలు చేసి జాతరలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్నారు. మంగళవారం అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో ఏ అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా రూరల్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా వెంకటేశ్వరరావు



జగ్గంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటకు చెందిన పారిశ్రామికవేత్త, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కొత్త వెంకటేశ్వరరావు(కొండబాబు)ను రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఆయన గతంలో అన్నవరం దేవస్థానం బోర్డు మెంబర్‌గా.. లయన్స్ క్లబ్, వాకర్స్ క్లబ్, వినియోగదారుల ఫోరం ఇలా అనేక సంస్థల్లో గౌరవ సభ్యులుగా పని చేశారు. ప్రస్తుతం జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆటోడ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

కోటనందూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలపై ఆటోడ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ టి.రామకృష్ణ అన్నారు. మంగళవారం కోటనందూరులో ఆటో డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తుని-నర్సీపట్నం రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయని, మితిమీరినా వేగం లేకుండా చూడాలన్నారు. రాత్రుల సమయంలో మహిళా ప్రయాణికులను క్షేమంగా ఇంటికి చేర్చాలన్నారు. చట్టాలను గౌరవించాలన్నారు. వాహనదారులకు రికార్డులు సక్రమంగా ఉండాలని ఎస్ఐ సూచించారు.

అపార్ ఐడీ జనరేషన్‌పై సమీక్షా సమావేశం

గండేపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాల ప్రధానోపాధ్యాయులతో అపార్ ఐడీ జనరేషన్‌పై మంగళవారం ఎంపీడీవో నాతి బుజ్జి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఒకటి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న 6054 మందికి ఐడీలు జనరేట్ కావాల్సిఉండగా 4593 మందికి అపార్ ఐడీలు జనరేట్ అయ్యాయని ఇంకా 1461మందికి పెండింగ్ ఉందన్నారు. పుట్టినతేదీ, ఆధార్ కేంద్రాల వల్ల ఎలాంటి ఇబ్బందులు కలిగిన తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు కెహెచ్ నాయక్, వెంకటరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, డిజిటల్ అసిస్టెంట్లు ఉన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్

జగ్గంపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో పాత పోలీస్‌స్టేషన్ వద్ద ప్రతి మంగళవారం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. మంగళవారం ఈ క్యాంటీన్ ద్వారా 600 మంది భోజనాలు ఏర్పాటు చేశారు. సూరపురెడ్డి నరేష్, రాజనాల శ్రీను, మాదారపు వీరబాబు, గంధం శ్రీనివాస్, దొడ్డా శ్రీను, మొగిలి గంగాధర్, కాయల మణికంఠ, పాలెం బాబి తదితరులు ఉన్నారు.

క్రీడా దుస్తుల అందజేత

రౌతులపూడి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ కళాశాల నందు విద్యార్థులకు టీడీపీ యువనేత పల్లి సూర్యకుమార్ మంగళవారం క్రీడా దుస్తులను అందజేసారు. రూ.20 వేలు విలువ గల దుస్తులను అందజేశారు. కార్యక్రమంలో చింతకాయల శ్రీను, ఉపాధ్యాయులులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు

తొండంగి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షా అభియాన్ ద్వారా దివ్యాంగ బాలలకు మండల వనరుల కేంద్రంలో మంగళవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. డాక్టర్ వి.సందీప్ చిన్నారులకు వైద్యసేవలందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు షేక్ బాబ్జి, ఎ.సుబ్బిరెడ్డి, ఐఈఆర్టీ నాగేశ్వర్రావు, వాసుదేవరావు, సత్యన్నారాయణ తదితరులున్నారు.

ఆలయానికి ఇన్వర్టర్ వితరణ

ఏలేశ్వరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురంలో పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన కొత్త నాగేశ్వరరావు మంగళ వారం సుమారు రూ.25వేలు విలువ చేసే ఇన్వర్టర్, బ్యాటరీ అందజేశారు. కార్యక్రమంలో ధనేకుల వీరభద్రరావు, చిలకమర్తి ఆదినారాయణ, బోడపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అనుచిత పోస్టులు పెట్టిన వ్యక్తి అరెస్ట్

జగ్గంపేట రూరల్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు, అశ్లీల ఫొటోలు పెట్టిన జగ్గంపేటకు చెందిన కాపారపు వెంకటరమణను పోలీసులు అరెస్ట్ చేసినట్టు సమాచారం. వెంకటరమణను రహస్య ప్రదేశంలో విచారిస్తున్నట్టు తెలిసింది.

బాలికకు 'ఐరిక్స్' ఆర్థిక సాయం

కూనవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోచవరం కాలనీలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన అశ్రితకు ఐరిక్స్ ఆపరేషన్ బ్యాంకు మిత్రల ఆధ్వర్యంలో వితరణ రూ.24వేలు అందజేశారు. దాతలకు బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐరిక్స్ ఆపరేషన్స్ మేనేజరు రవికుమార్, చానల్ మేనేజరు నారాయణ, బ్యాంకు మిత్ర రాధిక పాల్గొన్నారు.



బాలికకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఐరిక్స్ ఆపరేషన్స్ మేనేజరు రవికుమార్

మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరుగా చల్లారావు



చింతూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చింతూరు డివిజన్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా చల్లారావు నియమితులయ్యారు. ఇప్పటివరకు విజయవాడ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వర్తించిన ఆయనకు పదోన్నతి కల్పించి చింతూరు బదిలీ చేశారు. రంపచోడవరం డివిజన్ ఎంవీఐ రాజేష్‌కుమార్ చింతూరులో డిప్యూటేషన్‌పై పని చేశారు.

'ప్రతి ఒక్కరూ ఎన్‌పీసీఐ చేయించుకోవాలి'

దేవీపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ దగ్గరలోని పోస్టాఫీసుకు ఆధార్ కార్డు తీసుకెళ్లి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) లింక్ చేయించుకోవాలని దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి కోరారు. బ్యాంక్ అకౌంట్, పోస్టల్ అకౌంట్ కలిగిన వారంతా తప్పనిసరిగా ఎన్‌పీసీఐ చేయించుకోవాలన్నారు. దీనివల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాల సొమ్ము లబ్ధిదారుల ఖాతాలో నేరుగా జమయ్యే అవకాశముందన్నారు.

రేపు వలంటీర్ల జిల్లా స్థాయి సదస్సు

రంపచోడవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సచివాలయ వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ వలంటీర్ల సదస్సు తలపెట్టారు. గురువారం రంపచోడవరంలో జరిగే వలంటీర్ల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు మట్ల వాణిశ్రీ, కార్యదర్శి పల్లపు వెంకట్ పిలుపునిచ్చారు. 11 మండలాలకు చెందిన వలంటీర్లు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.